
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
సోమవారం 16 జూన్ 2025



నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

విశాఖపట్నం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టరేట్, జీవీఎంసీ, పోలీస్ కమిషనర్ కార్యాలయాల్లో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం రద్దు చేసినట్టు ఆయా శాఖల అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు సోమవారం నగరంలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చితో పాటు జీవీఎంసీ అధికారులంతా ఆయా కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉన్నందున పీజీఆర్ఎస్‌ను రద్దు చేశారు.



జనవరి 28న టీ20 మ్యాచ్

- ఏసీఏ-వీడీసీఏ స్టేడియం వేదికగా భారత్, న్యూజిలాండ్ మధ్య నిర్వహణ

విశాఖపట్నం (స్పోర్ట్సు), జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పీఎంపాలెంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లకు రంగం సిద్ధమవుతోంది. త్వరలో జరగనున్న వుమెన్ వరల్డ్ కప్ టోర్నీకి ఆతిథ్యమిచ్చేందుకు సమాయత్తమవుతున్న విశాఖ... వచ్చే ఏడాది ప్రారంభంలో కూడా మరో అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్ నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ లభించింది. జనవరి 28న భారత్, న్యూజిలాండ్ మధ్య జరగనున్న అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌కు ఏసీఏ-వీడీసీఏ స్టేడియం కానున్నది. న్యూజిలాండ్ జట్టు భారత్ పర్యటనలో భాగంగా భారత్‌తో మూడు వన్డేలు, ఐదు టీ20 మ్యాచ్‌ల సిరీస్‌లు ఆడనున్నది. ఇందుకు సంబంధించిన మ్యాచ్‌ల తేదీలు, వేదికల షెడ్యూల్‌ను భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) ఆదివారం ప్రకటించింది. ఐదు టీ20 సిరీస్‌కు సంబంధించి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్‌కు (ఏసీఏ) ఒక మ్యాచ్‌ను కేటాయిస్తూ షెడ్యూల్ విడుదల చేసింది. ఇందులో భాగంగా భారత్, న్యూజిలాండ్ మధ్య జనవరి 28న జరగనున్న నాలుగో టీ20 మ్యాచ్‌కు ఏసీఏ-వీడీసీఏ స్టేడియం వేదిక కానున్నది. దీంతో ఇప్పటి వరకు మూడు టెస్టు మ్యాచ్‌లు, పది వన్డే మ్యాచ్‌లు, నాలుగు అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చిన విశాఖ... త్వరలో ఐదో టీ20 మ్యాచ్ నిర్వహణకు సిద్ధమవుతోంది.

డిఫెన్స్ మద్యం బాటిళ్లు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

- నిందితుడు డాక్‌యార్డులో కాంట్రాక్టు కార్మికుడు

7లో

యోగా బడ్జెట్ రూ.62 కోట్లు!

రూ.20 కోట్ల విడుదలకు జీవో జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం



ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో సిద్ధమవుతున్న వేదిక

- కార్యక్రమ నిర్వహణకు భారీగా అధికారుల నియామకం
- మ్యాట్లు, టీషర్టులను సరఫరా చేసిన కేంద్రం

విశాఖపట్నం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఈ నెల 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి రూ.62 కోట్ల వరకు వ్యయమవుతుందని జిల్లా యంత్రాంగం అంచనా వేసింది. ప్రముఖుల పర్యటనలు, వాహనాల ఏర్పాటు, గదుల అద్దె, ఫుడ్, ఇతరత్రా ఖర్చులు, యోగా కంపార్టుమెంట్ల వద్దకు ప్రజలను తరలించే బస్సులు, ఆటోలు, ఇతరత్రా కార్యక్రమాలకు సొమ్ములు అవసరమని అంచనా వేశారు. యోగా ప్రదర్శనలో భాగంగా ప్రధాన వేదికను ఆర్కే బీచ్ వద్ద ఏర్పాటు చేస్తున్నారు. ఈ వేదిక ప్రాంతం నుంచి పార్కు హోటల్ కంపార్టుమెంటు వరకు రోడ్డుపై మ్యాట్‌లు వేయాలి. అలాగే పార్కు హోటల్ నుంచి భీమిలి వరకు, పార్కు హోటల్ నుంచి ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానం వరకు మ్యాట్లు వేయాలి. ఇంకా ప్రజలందరికీ స్నాక్స్ సరఫరా చేయాలి. ఒకవేళ వర్షం వస్తే ప్రధాన వేదికగా గుర్తించిన ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో భారీ షెడ్లు వేస్తున్నారు. దీనికి కూడా భారీ ఖర్చు అవుతుంది. ఈ నేపథ్యంలో రూ.62 కోట్ల నిధులు కావాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అయితే తాజాగా ... మిగతా 6వ పేజీలో

నేడు సీఎం చంద్రబాబు రాక

- బీచ్ రోడ్డులో యోగా దినోత్సవ ఏర్పాట్ల పరిశీలన
- హోటల్ నోవాటెల్‌లో అధికారులతో సమీక్ష
- పీఎం పాలెం వైజాగ్ కన్వెన్షన్ సెంటర్‌లో టీడీపీ కార్యకర్తల సమావేశానికి హాజరు



విశాఖపట్నం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సోమవారం నగర పర్యటనకు రానున్నారు. ఉదయం 11 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి 11.40కు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. పది నిమిషాలపాటు ఎయిర్‌పోర్టులో గడిపాక 11.50 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 12.10కు ఆర్కే బీచ్ రోడ్డులోని కాళీమాత గుడి వద్దకు చేరుకుంటారు. 12.15 నుంచి 12.40 గంటల వరకు పార్కు హోటల్ వరకూ అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్లను ఆయన పరిశీలిస్తారు. అనంతరం 12.45 గంటలకు బయలుదేరి ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానానికి చేరుకుని అక్కడ యోగా దినోత్సవ ఏర్పాట్లను తిలకిస్తారు. మధ్యాహ్నం 1.05 గంటలకు హోటల్ నోవాటెల్‌కు వెళతారు. భోజన విరామం తరువాత 2.15 నుంచి 3.30 గంటల వరకు యోగా దినోత్సవంపై అధికారులతో సమీక్షిస్తారు. ఆ తరువాత 3.40 గంటలకు అక్కడ నుంచి బయలుదేరి సాయంత్రం నాలుగు గంటలకు పీఎం పాలెంలోని వైజాగ్ కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకుని, సాయంత్రం ఆరు గంటల వరకు పార్టీ కార్యకర్తల సమావేశంలో చంద్రబాబు పాల్గొంటారు. ఆ సమావేశం ముగిశాక అక్కడ నుంచి బయలుదేరి 6.15 గంటలకు సీతంపేట రాజేంద్రనగర్‌లో గల టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఇంటికి సీఎం చేరుకుంటారు. ఇటీవల మృతి చెందిన మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. సాయంత్రం 6.30 గంటలకు అక్కడ నుంచి బయలుదేరి 6.45కు విమానాశ్రయానికి చేరుకుంటారు. 6.55 గంటలకు చంద్రబాబు ప్రత్యేక విమానంలో విజయవాడకు బయలుదేరి వెళతారు.

ప్రతిష్ఠాత్మకంగా యోగా దినోత్సవం

- ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాహనాల్లోనే ప్రజలను తరలించాలి
- ప్రైవేటు వాహనాలను అనుమతించబోం
- 2,085 బస్సులతో పాటు ఆటోలు, వ్యాన్‌ల ఏర్పాటు
- ప్రదర్శన తరువాత అందరికీ స్నాక్స్ అందజేస్తాం
- జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్


ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

విశాఖపట్నం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఈ నెల 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాల్గొంటున్నందున ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోందని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం కలెక్టరేట్‌లో ప్రజాప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యోగా దినోత్సవానికి హాజరయ్యే ప్రజలందరూ తమ ప్రాంతంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన బస్సులు, ఆటోలు, టాటా మ్యాజిక్ వ్యాన్లు, తదితర వాహనాల్లోనే రావాలని స్పష్టం చేశారు. ప్రైవేటు వాహనాలను అనుమతించబోమని పేర్కొన్నారు. నగరంలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మార్కింగ్ చేసిన ప్రాంతాలకు ప్రజలను సకాలంలో తరలించడం ముఖ్యమని.. దీనికి అధిక ప్రాధాన్యతనివ్వాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. నియోజకవర్గాల నుంచి బస్సులు తెల్లవారుజామునే బయలుదేరి సకాలంలో తమకు కేటాయించిన కంపార్టుమెంట్లకు చేరుకునేలా శ్రద్ధ చూపాలని హరేంధిర ప్రసాద్ కోరారు. సచివాలయాల వారీగా ప్రజలకు ఏ కంపార్టుమెంట్ కేటాయించామనే విషయం ఇప్పటికే తెలియజేశామన్నారు. ఎక్కడ వాహనాలు దిగాలో, తిరిగి ... మిగతా 6వ పేజీలో

నరకం చూపిస్తున్న రోడ్లు

ఇష్టారాజ్యంగా రహదారులను తవ్వేస్తున్నారు..

- జీవీఎంసీతో ఇతర శాఖల అధికారుల మధ్య కానరాని సమన్వయం
- పైపు లైన్లు, యూజీడీ, భూగర్భ కేబుళ్ల కోసం యథేచ్ఛగా రోడ్ల తవ్వకం
- ఒకవైపు నుంచి కొత్త రోడ్డు వేస్తే మరోవైపు నుంచి తవ్వేస్తున్న వైనం
- తిరిగి గోతులను పూడ్చడంలో అంతులేని నిర్లక్ష్యం
- తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న నగరవాసులు




అక్కయ్యపాలెం 80 అడుగుల రహదారి వద్ద మంచినీటి కుళాయి కోసం తవ్వి వదిలేసిన రోడ్డు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలోని అనేక ప్రాంతాల్లో రోడ్లు నగరవాసులకు నరకం చూపిస్తున్నాయి. జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు ఒకవైపు కొత్త రోడ్ల నిర్మాణం చేస్తుంటే... మరోవైపు నుంచి నీటి సరఫరా, భూగర్భ మురుగు నీటి వ్యవస్థ, భూగర్భ విద్యుత్ కేబుల్ వ్యవస్థ కోసం తవ్వకాలు జరుపుతున్నారు. దీనివల్ల నగరంలోని రహదారులన్నీ చిందరవందరగా తయారవ్వడంతోపాటు రూ.కోట్ల ప్రజాధనం వృథాగా మారుతోంది. జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులకు ఇతర విభాగాలు, శాఖల అధికారుల మధ్య సమన్వయం లేకపోవడమే దీనికి ప్రధాన కారణమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నగరంలో ఏటా వివిధ గ్రాంటుల కింద సుమారు రూ.150 కోట్లు ఖర్చుపెట్టి రోడ్ల నిర్మాణం చేస్తుంటారు. ఒకసారి రోడ్డు నిర్మాణం చేస్తే నగర పరిధిలో కనీసం ఐదేళ్లపాటు నిర్వహణ అవసరం ఉండదు. ఒకవేళ ఈలోగా ఏదైనా మరమ్మతు జరిగినా, గుంతలు ఏర్పడినా సంబంధిత కాంట్రాక్టరే నిర్వహణ బాధ్యత వహించాల్సి ఉంటుంది. కానీ నగరంలో కొత్తగా నిర్మించిన రోడ్డు కనీసం ... మిగతా 6వ పేజీలో

మృత్యు రహదారి!

పోర్టు రోడ్డులో ప్రమాదాల నియంత్రణపై దృష్టి సారించిన పోలీసులు

- వరుస ప్రమాదాలకు కారణాలను గుర్తించి సరిదిద్దేందుకు కసరత్తు


పోర్టు రోడ్డులోని మారుతి జంక్షన్

విశాఖపట్నం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కాన్వెంట్ జంక్షన్ నుంచి షీలానగర్ వరకు ఉన్న పోర్టు రోడ్డులో వరుస ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో పోలీసులు నియంత్రణ చర్యలపై దృష్టి సారించారు. రోడ్డు ప్రమాదాలకు కారణం ఏమిటనేది దానిని గుర్తించి, సరిదిద్దడం ద్వారా ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలని భావిస్తున్నారు. సింధియా నుంచి ద్విచక్ర వాహనంపై నగరంలోకి వస్తున్న నేవీ ఆస్పత్రి వైద్యుడు, స్టాఫ్ నర్సు శనివారం ఎస్ఆర్ కంపెనీ వద్ద రోడ్డు ప్రమాదానికి గురై ట్యాంకర్ కింద పడి ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. 24 గంటలు కూడా గడవక ముందే ఇదే మార్గంలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న నవదంపతులు మారుతి సర్కిల్ వద్ద రోడ్డు ప్రమాదానికి గురై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. గత వారం మారుతి సర్కిల్ వద్దే ఓ ద్విచక్ర వాహనదారుడు రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. తరచూ ఒకేచోట రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. అసలు ప్రమాదాలకు కారణం ఏమిటనే దానిని గుర్తించాలని సీపీ శంఖబ్రత బాగ్చి ట్రాఫిక్ పోలీసులను ఆదేశించినట్టు తెలిసింది. దీంతో హార్బర్, గాజువాక ట్రాఫిక్ పోలీసులు ఆదివారం పోర్టు రోడ్డును ... మిగతా 6వ పేజీలో

కాళ్ల పారాణి ఆరకముందే...

- రోడ్డు ప్రమాదంలో నవ దంపతుల మృతి
- ఇద్దరూ గాజువాకలో ల్యాబ్ టెక్నీషియన్లు


సాయి, శాలినిల పెళ్లి ఫొటో

మల్కాపురం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కాళ్ల పారాణి ఆరకముందే.. మామిడి తోరణాలు వాడకముందే.. పెళ్లి నాటి సందడిని మరవకముందే ఆ నవ దంపతులు కానరాని లోకాలకు తరలిపోయారు. ప్రేమించుకుని పెద్దలను ఒప్పించి వివాహం చేసుకున్న నెల రోజులకే వారిద్దరూ ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. విశాఖలోని గాజువాక పోలీస్ స్టేషన్ పరిధి మారుతి జంక్షన్ వద్ద చోటుచేసుకున్న ఈ విషాద సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా పిఠాపురం ప్రాంతానికి చెందిన జొన్నాడ సాయి (27), విశాఖలోని గంగవరం ప్రాంతానికి చెందిన ఎరిపిల్లి శాలిని (25) గాజువాకలోని బెస్ట్ విజన్ ఆస్పత్రిలో ... మిగతా 6వ పేజీలో



బీచ్‌కు పోటెత్తిన సందర్శకులు

విశాఖపట్నం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సెలవు రోజు కావడంతో ఆదివారం ఆర్కే బీచ్‌కు సందర్శకులు పోటెత్తారు. ఇటు ఆర్కే బీచ్ నుంచి అటు వీఎంఆర్డీఏ పార్కు వరకు ఉన్న తీరం వెంబడి వందలాది మంది ప్రజలు తీరంలో స్నానాలు చేస్తూ ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. ఇసుకవేస్తే రాలనంతంగా జనం రావడంతో తీరమంతా సందర్శకులతో కిటకిటలాడుతూ కనిపించింది. వాతావరణం కూడా చల్లగా ఉండడంతో సందర్శకులు ఆనందంగా గడిపారు. ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ ఎంజాయ్ చేశారు. బీచ్ రోడ్డు అంతా వాహనదారులతో రద్దీగా మారింది.

పెరుగుతున్న కోతలు

- ప్రైవేటు ఆస్పత్రులతో సమానంగా ప్రభుత్వాస్పత్రుల్లో సిజేరియన్లు
- గతంతో పోలిస్తే భారీగా తగ్గిన సాధారణ ప్రసవాలు
- గడిచిన నాలుగేళ్లలో మొత్తం 1,68,844 ప్రసవాలు
- ఇందులో సిజేరియన్లు 58,614
- ప్రతి ముగ్గురిలో ఒకరికి సిజేరియన్..
- ప్రైవేటు ఆస్పత్రులకు కాసులు కురిపిస్తున్న వైనం
- రూ.80 వేల నుంచి రూ.2 లక్షల వరకూ వసూలు



విశాఖపట్నం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో సిజేరియన్లు భారీగా పెరుగుతున్నాయి. గతంలో అతికొద్దిమందికి మాత్రమే సిజేరియన్ చేయాల్సిన పరిస్థితి వచ్చేది. అయితే ఇప్పుడు ప్రతి ముగ్గురిలో ఒకరికి సిజేరియన్ చేస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ప్రైవేటు ఆస్పత్రులతో పోలిస్తే ప్రభుత్వ ఆస్పత్రుల్లో సిజేరియన్లు కాస్త తక్కువే అయినప్పటికీ... గతంతో పోలిస్తే మాత్రం పెరిగాయి. దీనికి వైద్యులు అనేక కారణాలను ... మిగతా 6వ పేజీలో

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు
- పద్మనాభం మండలంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభం




పద్మనాభంలో మండల పరిషత్ సమావేశ మందిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, వి.కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాట్ల పరిశీలన

పద్మనాభం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. పద్మనాభంలో ఆదివారం జరిగిన పలు కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఖరీఫ్‌కు అవసరమైన రాయితీ విత్తనాలను సిద్ధం చేశామని తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా నియోజకవర్గంలోని 14731 మంది రైతులకు రూ. 20 వేలు చొప్పున రూ.20 కోట్ల ఆర్థిక సాయానికి ఏర్పాట్లు పూర్తయ్యాయని చెప్పారు. ఏడు ఇనాం గ్రామాల రైతులకు కూడా ఆర్థిక సాయం అందుతుందన్నారు. తాను కూడా రైతు కుటుంబం నుంచి వచ్చానని, వారి కష్టాలు తెలుసునని చెప్పారు. ఎంపీపీ విజ్ఞప్తి మేరకు మండల పరిషత్ సమావేశ మందిరానికి ఫర్నీచరు సమకూరుస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఏరువాక పూజ చేసి, అరకతో భూమిని దున్నారు. రైతులకు రాయితీ విత్తనాలు పంపిణీ చేశారు. కౌలు రైతులకు కార్డులు పంపిణీ చేశారు. అలాగే పద్మనాభంలో రూ. 32 లక్షలతో నిర్మించిన మండల పరిషత్ సమావేశ మందిరాన్ని ప్రారంభించారు. ఎన్టీఆర్ పార్కులో టీడీపీ మండల పార్టీ కార్యాలయం నూతన భవనం నిర్మాణానికి భూమి పూజ చేశారు.

ఈ కార్యక్రమంలో జనసేన భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి పంచకర్ల సందీప్, భీమిలి ఏఎంసీ చైర్మన్ కె.రామస్వామినాయుడు, ఎంపీపీ కె. రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, కాపు కార్పొరేషన్ డైరెక్టరు కె. లీలావతి, జిల్లా వ్యవసాయాధికారి కె. అప్పలస్వామి, ఏపీ సూక్ష్మ సాగునీటిపారుదలశాఖ జిల్లా అధికారి మన్మథరావు, జిల్లా ఉద్యానశాఖ అధికారి శ్యామల, భీమిలి వ్యవసాయ శాఖ ఏడీ విజయ ప్రసాద్, ఏఓ చలం, పద్మనాభం, పెందుర్తి జెడ్పీటీసీ మాజీ సభ్యులు దామోదరరావు, నారాయణరావు, టీడీపీ మండల అధ్యక్షుడు రమణ, సర్పంచ్ పాప, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి, టీడీపీ నాయకులు నగేష్‌కుమార్, ఎర్రిబాబు, నందీశ్వరరావు, అప్పలనాయుడు, ప్రసాద్, గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

కొమ్మాది : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పీఎంపాలెంలోని వి. కన్వెన్షన్ హాల్‌లో పార్టీ కార్యకర్తలతో నిర్వహించనున్న సమావేశం ఏర్పాటను ఎమ్మెల్యే గంటా, సీఎం ప్రోగ్రామ్ కమిటీ కన్వీనర్ పెందుర్తి వెంకటేష్ పరిశీలించారు. సీఎం ప్రధాన హాల్‌కు చేరుకునే మార్గం, నాయకులు, కార్యకర్తలు ఉండాల్సిన ప్రాంతం, తదితర పనులను పర్యవేక్షించారు.

వైభవంగా మిథున సంక్రమణం



మాడవీధిలో స్వామివారి తిరువీధి ఉత్సవం

సింహాచలం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో మిథున సంక్రమణం ఉత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. విడాయితీ సంప్రోక్షణ పురస్కరించుకుని కలశారాధనలు, ఆలయ సంప్రోక్షణ జరిపారు. సాయంత్రం ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో శోభాయమానంగా అలంకరించి, పల్లకిలో ఉంచారు. ఆలయ విద్వాంసుల మంగళ వాయిద్యాలు, పండితుల వేద పఠనాల నడుమ మాడవీధుల్లో తిరువీధి ఉత్సవం జరిపారు. మార్గం పొడవునా భక్తులు కర్పూర నీరాజనాలతో స్వామివారికి ఆహ్వానం పలికారు.

వినియోగంలోకి బయో డైజెస్టర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సింహాచలం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానానికి స్టీల్ ప్లాంట్ విరాళంగా అందజేసిన బయోడైజెస్టర్‌ను ఎట్టకేలకు వినియోగంలోకి తీసుకువచ్చారు. 'నిరుపయోగంగా యంత్రాలు' అన్న శీర్షికన ఈనెల 13న 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి ఈఓ త్రినాథరావు స్పందించారు. ఈమేరకు పారిశుధ్య విభాగం పర్యవేక్షణాధికారి రాజ్యలక్ష్మి పర్యవేక్షణలో సిబ్బంది యంత్రాన్ని శుభ్రపరచి, ఆదివారం నుంచి తిరిగి వినియోగంలోకి తీసుకువచ్చారు. నిర్మాల్య పుష్ప, తులసి మాలికలను తెచ్చి యంత్రంలో వేసి ఎరువుగా తయారు చేశారు.

వెంకన్న సన్నిధిలో సుదర్శన హవనం

సింహాచలం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం కొండ దిగువ స్వామివారి పూదోటలో కొలువుదీరిన పద్మావతి, అలిమేలు మంగా సమేత వేంకటేశ్వరస్వామి సన్నిధిలో ఆదివారం సుదర్శన హవనం నిర్వహించారు. వేంకటేశ్వరుని ఆవిర్భావ నక్షత్రం శ్రవణాన్ని పురస్కరించుకుని ప్రతి మాసంలో ఒకసారి హవనం చేయడం ఆనవాయితీ. ఈమేరకు సుప్రభాత సేవ, ప్రభాతారాధనలు తరువాత యజ్ఞకర్తగా సుదర్శన పెరుమాళ్‌ను పుష్పమాలికల నడుమ వేదికపై ఉంచారు. ఆగమశాస్త్రం అనుసరించి కలశారాధన, బింబారాధన, మండపారాధన చేసి ముందుగా సిద్ధం చేసిన హోమ కుండంలో అగ్ని ప్రతిష్ఠాపన జరిపారు. తరువాత ఆలయ రుత్విక్‌లు పంచ సూక్తాలు, సుదర్శన మూలమంత్రంతో హవనాన్ని నిర్వహించారు. మహా పూర్ణాహుతి తరువాత ప్రధాన కలశాన్ని అంతరాలయంలో మూలవిరాట్ వద్ద ఉంచి పూజలు జరిపి, అందులోని పవిత్ర జలాలతో భక్తులను ప్రోక్షణ చేశారు.

92 మందికి హోమియో మందులు పంపిణీ

భీమునిపట్నం,జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని చిన్నబజారు డచ్ వీధిలో వున్న కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ సంస్థ కార్యాలయంలో ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు 92 మంది రోగులకు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్, వైద్యులు జగన్నాథరావు, మోహన్, ఫౌండేషన్ ప్రతినిధులు మూర్తి, చంద్రశేఖర్, బానోజీరావు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు దుస్తులు పంపిణీ

తగరపువలస, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస బంతాట మైదానంలో ఆదివారం జరిగిన క్రికెట్ లీగ్ మ్యాచ్‌లో పాల్గొన్న క్రీడాకారులకు విజయనగరం జడ్పీ చైర్మన్, వైసీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి మజ్జి శ్రీనివాసరావు కుమార్తె సిరిసహస్ర దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం టాస్ వేసి పోటీలను ప్రారంభించారు.

ఇండోర్ స్టేడియం అభివృద్ధికి చర్యలు

భీమునిపట్నం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో క్రీడాకారులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తామని టీడీపీ యువ నాయకుడు గంటా రవితేజ తెలిపారు. ఆదివారం ఆయన నీడీ వెల్ఫేర్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు స్టేడియాన్ని సందర్శించి, క్రీడాకారులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం తరహాలో ఇండోర్ స్టేడియం అభివృద్ధి గురించి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లి చర్చిస్తామన్నారు. ఇప్పటికే స్టేడియం అభివృద్ధికి రూ. 2 కోట్లు మంజూరయ్యాయన్నారు. అనంతరం అసోసియేషన్ సభ్యులను రవితేజను సత్కరించారు. ఈ కార్యక్రమంలో 2వ వార్డు కార్పొరేటర్ గాడు చిన్నికుమారి లక్ష్మి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, నాయకులు అప్పలనాయుడు, నరేంద్రకుమార్, బీఎన్‌డబ్ల్యూ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విదేశాల్లో జాబ్ స్కామ్ చేస్తున్న వ్యక్తి అరెస్టు

ఎండాడ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : కంబోడియా, మయాన్మార్, బ్యాంకాక్, లావోస్ దేశాల్లో చైనా స్కామ్ కంపెనీలకు మనుషులను తరలిస్తున్న వ్యక్తిని సైబర్ క్రైమ్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. అనకాపల్లి జిల్లాకు చెందిన ముఖేష్ నగరానికి చెందిన అంకిత అనే మహిళతో పరిచయం పెంచుకున్నాడు. ఆమె వేరొకరి ద్వారా లావోస్ వెళ్లి అక్కడ చైనా ఆధారిత స్కామ్ జాబ్ సంస్థలో పనిచేస్తూ దేశంలోని సోషల్ మీడియా వేదికగా పరిచయాలు పెంచుకుంది. ఆమె ద్వారా ఇటీవల విశాఖ నుంచి ఐదుగురు యువకులు లావోస్ వెళ్లి మోసపోయి ఇండియన్ ఎంబసీ ద్వారా తిరిగి నగరానికి చేరుకున్నారు. యువకుల ఫిర్యాదు మేరకు సైబర్ క్రైం పోలీసుల ముఖేష్‌ను అరెస్టు చేశారు. అంకిత కోసం లుక్ అవుట్ సర్క్యులర్ జారీ చేశారు.

కాళ్ల పారాణి ఆరకముందే...

... 5వ పేజీ తరువాయి



ప్రమాదంలో మృతి చెందిన సాయి, శాలిని

ల్యాబ్ టెక్నిషియన్లుగా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇద్దరూ ప్రేమించుకోవడంతో పాటు పెద్దలను ఒప్పించి పిఠాపురంలో గతనెల 9న వివాహం చేసుకున్నారు.అనంతరం బంధువులకు గాజువాక ప్రాంతంలో విందు కూడా ఇచ్చారు. ప్రస్తుతం దంపతులిద్దరూ గాజువాకలోనే నివాసం ఉంటున్నారు. శనివారం సాయి పుట్టినరోజు కావడంతో సెలవు లేని కారణంగా ల్యాబ్‌లోనే ఉండిపోయారు. ఆదివారం నగరంలోని ఆర్కే బీచ్‌కు వెళ్లేందుకు ములగాడ రోడ్డు మీదుగా ద్విచక్ర వాహనంపై బయలుదేరారు.ఈ క్రమంలో మారుతి జంక్షన్ వద్ద ఓ ట్రాలర్ వెనుక నుంచి వీరి వాహనాన్ని బలంగా ఢీకొనడంతో వారిద్దరూ రోడ్డుపై తుళ్లిపడ్డారు. దీంతో సాయి అక్కడికక్కడే మృతి చెందగా, శాలిని కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది. ప్రమాదానికి కారణమైన ట్రాలర్ డ్రైవరును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈమేరకు గాజువాక ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తగరపువలసలో ట్రాఫిక్ జామ్



తగరపువలస బైపాస్ రోడ్డు వద్ద నిలిచిన వాహనాలు

తగరపువలస, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం రెండు గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. రోడ్డుకి ఒకవైపు వాహనాలు భారీ ఎత్తున బారులు తీరాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. విశాఖ నుంచి విజయగనరం వైపు వెళ్లే రహదారిలో వంతెన దాటిన తర్వాత ఫంక్షన్ హాలు, హోటళ్ల సమీపంలో వాహనాలు మరమ్మతుతో నిలిచిపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఈప్రాంతంలో సర్వీసు రోడ్లు ఇరుగ్గా ఉండడంతో వాహనాలు ఎక్కడికక్కడ స్తంభించిపోయాయి. వారంలో ఒకటి రెండుసార్లు ఇదే పరిస్థితి ఏర్పడుతోందని స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలో పద్మనాభం వెళ్లడానికి ఒక రహదారి, చిప్పాడ వైపు వెళ్లే రెండు రహదారులు కలవడం వల్ల నిత్యం వాహనాల రద్దీ ఉంటోంది. పాలకులు, అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్య పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

దివీస్‌కు రెడ్ క్రాస్ 'రక్తదాతల అవార్డు'

భీమునిపట్నం (రూరల్), జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిప్పాడలో ఉన్న దివీస్ కర్మాగారానికి రక్తదాతగా రెడ్ క్రాస్ సొసైటీ నుంచి అవార్డు లభించిందని జనరల్ మేనేజర్ వైఎస్ కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరులో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ టీకే మూర్తి ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చేతుల మీదుగా కంపెనీ భద్రతా విభాగం ప్రతినిధి మహేంద్ర అవార్డు అందుకున్నారని చెప్పారు. 15 ఏళ్లుగా తమ సంస్థ ఏటా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి, ప్రతి శిబిరం నుంచి వెయ్యి యూనిట్ల రక్తాన్ని అందిస్తుందన్నారు.

పీఎంపాలెంలో వికసిత్ భారత్ సంకల్ప సభ

కొమ్మాది, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : భారత్ 2047 నాటికి ప్రపంచంలోనే బలమైన ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చెందాలన్నదే వికసిత్ భారత్ లక్ష్యమని బీజేపీ రాష్ట్ర సోషల్ మీడియా ఇన్‌చార్జి అడుసుమిల్లి కేశవరావు అన్నారు. ఆదివారం పీఎంపాలెంలో జరిగిన వికసిత్ భారత్ సంకల్ప సభలో ఆయన మాట్లాడారు. ఈ కార్య క్రమంలో ఎండాడ మండల బీజేపీ అధ్యక్షుడు చోడవరపు నాగరాజు, సీనియర్ నాయకుడు ప్రమోద చక్రవర్తి, టీడీపీ వార్డు అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్, గొల్లంగి ఆనందబాబు, వికసిత్ భారత్ సంకల్ప సభ కన్వీనర్ ధానేష్, వర్మ, కైలాషరెడ్డి, మాధవరావు పాల్గొన్నారు.

కమనీయం..శివపార్వతుల కల్యాణం

సింహాచలం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 98వ వార్డు విజినిగిరి పాలెంలో కొలువుదీరిన ఉమా సహిత చంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో శివ పార్వతుల కల్యాణం ఆది వారం వైభవంగా జరిగింది. ఆలయ 11వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వేకువజామున సుప్రభాతసేవ తరువాత చంద్రమౌళేశ్వరునికి ఏక వార రుద్రాభిషేకం జరిపారు. అనంతరం శివాగమ శాస్త్ర విధానంలో పండితులు ద్వాదశి సోదరులు గణపతి పూజతో శ్రీకారం చుట్టారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి పుణ్యాహవచనము, షోడశోపచారాలు సమర్పించారు. తరువాత శివ పార్వతుల కల్యాణం నిర్వహించారు.



శిల్పారామం సమీపంలో తొలగించిన పలకలు

కాలువలపై శిథిలమైన పలకలు తొలగింపు

మధురవాడ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 5, 6, 7 వార్డుల పరిధిలో సర్వీసు రోడ్డుకి ఇరువైపులా ఉన్న కాలువల్లో పూడిక తీతలు ప్రారంభమయ్యాయి. ముందుగా కాలువలపై అస్తవ్యస్తంగా ఉన్న సిమెంటు పలకలను తొలగించారు.కాలువల్లో పూడికలు ఉండడంతో వర్షం పడినపుడు నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చొరవతో కాలువల్లో పూడికతీతకు జీవీఎంసీ నిధులు కేటాయించింది. ఈ నిధులతో ప్రస్తుతం పనులు మొదలయ్యాయి. పూడికలు తొలగించిన తరువాత కాలువలపై సిమెంటు పలకలు అమర్చుతారు. అలాగే పాడైన పలకల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తారు.

24న బంగారమ్మ పండగ

సింహాచలం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : సింహాద్రినాథుని సోదరి, అడివివరం తదితర ఏడు గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత బంగారమ్మ తల్లి వార్షిక పండగ ఈనెల 24న జరగనుంది. ఈమేరకు ఆదివారం సాయంత్రం దండోర వేశారు. ఉత్సవంలో భాగంగా 18వ తేదీ నుంచి గ్రామంలో సాయంత్రం జోగి, రాత్రి గరగల తిరువీధి నిర్వహిస్తారు. 23న తొలేళ్లు, 24న అనుపోత్సవం జరగనున్నాయి.

శిల్పారామంలో నృత్య ప్రదర్శన

మధురవాడ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా మధురవాడ శిల్పారామంలో నగరానికి చెందిన నృత్య కళాంజలి కళాకారులు ఆదివారం శాస్త్రీయ నృత్యాలు ప్రదర్శించారు. కళాకారులు నివేదిత, అశ్వతసాయి, మహాలక్ష్మి, నేహ, శ్రీనిధి, తన్వి, భవిష్య తదితరులు పలు కీర్తనలకు నృత్యాలు చేశారు.

మృత్యు రహదారి!

... 5వ పేజీ తరువాయి

పరిశీలించి రహదారి పరిస్థితిని పరిశీలించినట్టు సమాచారం. పోర్టు రోడ్డులో నిత్యం ధూళి ఎగిసిపడుతుండడంతో అది రోడ్డుమీద పడి జిడ్డులా తయారవుతోంది. చిన్నపాటి చినుకులు పడినా జిడ్డు కారణంగా వాహనాల టైర్లు స్కిడ్ అవుతున్నాయి. వాహనం ఒక లైన్‌లో వెళుతుందని డ్రైవర్ భావించినా, రోడ్డుపై జిడ్డు వల్ల కాస్త అటూఇటూ ఊగుతూ వెళుతున్నట్టు పోలీసులు గుర్తించినట్టు తెలిసింది. పైగా పోర్టు నుంచి రాకపోకలు సాగించే భారీ వాహనాల డ్రైవర్లు నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వల్ల ద్విచక్ర వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని, అలాగని భారీ వాహనం వెనుక వెళ్లలేక, ఓవర్‌టేక్ చేసేందుకు ప్రయత్నించి ప్రమాదాలకు గురవుతున్నారు. పోర్టు రోడ్డు విస్తరణ పనుల కారణంగా రోడ్డు పొడవునా మట్టి పేరుకుపోవడంతో వాహనాలు స్కిడ్ అయ్యేందుకు కారణంగా మారుతోందని ట్రాఫిక్ పోలీసులు అభిప్రాయపడుతున్నారు. ఇకపై పోర్టు రోడ్డును తరచూ శుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటే తప్ప ప్రమాదాలకు అడ్డుకట్ట పడే అవకాశం లేదని ఉన్నతాధికారులకు నివేదించాలని అధికారులు నిర్ణయానికి వచ్చారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహారావు



ర్యాలీ చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

మధురవాడ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ విధానాల వల్ల భవన నిర్మాణ పనులు మందగించి కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌వీ నరసింహారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఏడో వార్డులోని ద్రోణంరాజు కల్యాణ మండపంలో భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా మహా సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్లలో ప్రభుత్వ విధానాలు వల్ల భవన నిర్మాణ రంగం నిర్వీర్యమైందన్నారు. ఈ రంగంలో ఉపాధి పొందుతున్న వేలాది మంది కార్మికులు పనులు లేక రోడ్డున పడ్డారని పేర్కొన్నారు. ప్రభుత్వం సరళతరమైన విధానాలు ప్రవేశపెట్టి కార్మికులను ఆదుకోవాలని కోరారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన లేబర్ కోడ్స్‌ను రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేయాలని చూస్తుందన్నారు. అదే జరిగితే ప్రజా వ్యతిరేకత తప్పదని హెచ్చరించారు. కాగా తొలుత కొమ్మాది కూడలి నుంచి మధురవాడ, నగరంపాలెం రోడ్డు వరకు కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇటీవల మరణించిన సంఘం నాయకులు పందిరి రాము, సత్యనారాయణ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీటూ నాయకులు జ్యోతీశ్వరరావు, వెంకటరావు, డి. అప్పలరాజు, రామప్పడు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నరకం చూపిస్తున్న రోడ్లు

... 5వ పేజీ తరువాయి

ఏడాదిపాటు కూడా సుందరంగా ఉండకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. కొత్తగా రోడ్డు వేసిన కొద్ది రోజులకే అదే రోడ్డుని మరొక పని కోసం జీవీఎంసీలోని తాగునీటి సరఫరా, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఎలక్ట్రికల్ విభాగాలతోపాటు భూగర్భ విద్యుత్ కేబుళ్లు వేయడానికి ఏపీఈపీడీసీఎల్, స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా నీటి సరఫరా పైపు లైన్ల ఏర్పాటు కోసం తవ్వేస్తుండడం నగరవాసులను ఆగ్రహానికి గురిచేస్తోంది. శివాజీ పార్కు రోడ్డును ఏడాది కిందట రూ.కోట్లు వెచ్చించి కొత్తగా వేయడంతో ఆ మార్గం అందంగా కనిపించేది. కానీ ఇటీవల ఈ రోడ్డును నీటి సరఫరా పైపు లైన్ల కోసం తవ్వేయడంతో రోడ్డంతా బురదమయంగా మారిపోయింది. వాహనచోదకులు సైతం ఇబ్బందులకు గురవ్వడం, ప్రమాదాల బారినపడడం జరుగుతోంది. అలాగే అక్కయ్యపాలెం మహారాణి పార్లర్ జంక్షన్ నుంచి 80 ఫీట్ రోడ్డు మొత్తం అమృత్ పథకం కింద నీటి సరఫరా పైపు లైన్ల ఏర్పాటు నిమిత్తం తవ్వేయడంతో ఆరు నెలల కిందట నిర్మించిన తారురోడ్డు కాస్త మట్టిరోడ్డు మాదిరిగా కనిపిస్తోంది. సీతమ్మధార ప్రాంతంలో అన్ని రోడ్లను జీవీఎంసీ ఆరు నెలలు కిందట నిర్మిస్తే.. అమృత్ కోసం విచ్చలవిడిగా తవ్వేశారు. గురుద్వారా కూడలి నుంచి సత్యం జంక్షన్ వరకు జాతీయ రహదారి నిర్మాణం ఇటీవలే జరిగింది. కానీ విద్యుత్ కేబుళ్ల కోసం వెంటనే యంత్రాలతో రోడ్డును తవ్వేశారు. రోడ్లను తవ్విన తర్వాత మట్టితో కొంతవరకు కప్పి, తర్వాత గ్రావెల్ వేసి పైన కాంక్రీట్ వేసి పూడ్చాలి. దీనివల్ల భవిష్యత్తులో రోడ్డు కుంగకుండా ఉండడంతోపాటు వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఉంటుందనేది ఇంజనీర్ల అభిప్రాయం. కానీ ఏదైనా అవసరం కోసం రోడ్డు తవ్విన తరువాత ఆయా రహదారులను సక్రమంగా పూడ్చకుండా తవ్వి తీసిన మట్టితోనే పూడ్చేసి వదిలేస్తున్నారు. దీని వల్ల రోడ్లన్నీ గుంతలుగా మారడం, వర్షం పడితే అంతా మట్టిమయంగా మారిపోతోంది.

శాఖల మధ్య సమన్వయం కుదిరేది ఎప్పుడు?

జీవీఎంసీ అధికారులు ఒక మార్గంలో కొత్తగా రోడ్డు వేయాలనుకుంటే ఆ విషయాన్ని ముందుగానే గ్రేటర్ ఇంజనీరింగ్‌లోని ఇతర విభాగాలతోపాటు ఏపీఈపీడీసీఎల్, మొబైల్ నెట్‌వర్క్ ప్రొవైడ్ చేసే సంస్థలకు సమాచారం ఇవ్వాలి. ఆయా శాఖలు, విభాగాల ఆధ్వర్యంలో ఆ మార్గంలో పైపు లైన్లు, కేబుళ్ల నిర్మాణాల కోసం రోడ్డును భవిష్యత్తులో తవ్వాల్సి ఉంటుందని భావిస్తే... ఆ విషయాన్ని జీవీఎంసీ పబ్లిక్ వర్క్స్ ఇంజనీరింగ్ విభాగం అధికారులకు తెలియజేయాలి. కొత్తగా రోడ్డు వేసే మార్గంలో ఆయా శాఖలు, విభాగాల అధికారులు తమ పని పూర్తి చేసిన తరువాత కొత్తగా బీటీ రోడ్డు నిర్మిస్తే ఆ రోడ్డు ఐదేళ్లు కాకుండా ఏడెనిమిదేళ్లపాటు గుంతలు లేకుండా పటిష్ఠంగా ఉంటుంది.

దీనివల్ల ప్రజలకు సౌకర్యంగా ఉండడంతోపాటు ప్రజా ధనం దుర్వినియోగం కాకుండా అడ్డుకట్ట వేసినట్టవుతుంది. నగరంలో రోడ్లను ఇష్టారాజ్యంగా తవ్వేడంపై వివాదం తలెత్తిన ప్రతీసారి అన్ని శాఖల అధి కారులు సమావేశమై... ఇకపై రోడ్ల నిర్మాణం, తవ్వకంపై సమాచారం ఇచ్చిపుచ్చుకోవడం ద్వారా సమన్వయంతో ముందుకు వెళ్లాలని అధికారులు అభిప్రాయానికి వస్తున్నారు. కానీ ఏళ్లు గడిచినా ఆచరణలో మాత్రం అది అమలు కావడం లేదు. ఇకనైనా అధికారులు రోడ్ల నిర్మాణం, తవ్వకం విషయంలో సమన్వయంతో ముందుకు వెళ్లాలని ప్రజలు కోరుతున్నారు.

యోగా బడ్జెట్ రూ.62 కోట్లు!

... 5వ పేజీ తరువాయి

ప్రభుత్వం రూ.20 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో పలుమార్లు నిధుల కోసం జీవోలు వచ్చినా డబ్బులు విడుదల కాని సందర్భాలు ఉన్నాయి. దీంతో జిల్లా యంత్రాంగం నిధుల కోసం ఎదురుచూస్తోంది. మ్యాట్లు, టీషర్టులను కేంద్రం సరఫరా చేస్తుండంతో ప్రభుత్వానికి కొంత భారం తగ్గింది.

భారీ సంఖ్యలో అధికారుల నియామకం

యోగా దినోత్సవ నిర్వహణకు సంబంధించి ఏడుగురు ఐఏఎస్‌లు, ఏడుగురు ఐపీఎస్ అధికారులు, 31 మంది డిప్యూటీ కలెక్టర్లు, 101 మంది తహసీల్దార్లు, ఏడుగురు జిల్లా పౌరసరఫరాల అధికారులను నియమించారు. వీరికితోడు ఆర్టీసీ, రవాణా అధికారులు, భారీ స్థాయిలో పోలీసులను నియమించడంతో వారందరికీ వసతి, వాహన సౌకర్యంపై అధికారులు దృష్టిసారించారు. ఇంకా అమరావతి నుంచి పలువురు సీనియర్ అధికారులు వస్తున్నారు. మొత్తం 268 కంపార్టుమెంట్లకు గజిటెడ్ అధికారులను ఇన్‌చార్జిలుగా, వారికి సహాయం చేసే సిబ్బందిని నియమించారు. కంపార్టుమెంట్లలో సేవలందించేందుకు ఆరువేల మంది ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ, వైజాగ్ వలంటీర్లను నియమించారు. కంపార్టుమెంట్‌లోకి వచ్చే ప్రతిఒక్కరికీ చేతికి ఉండే బ్యాడ్జిని వలంటీర్లు స్కాన్ చేస్తారు. గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్సు కోసం స్కానింగ్ అవసరమని గుర్తించారు. నగరంలో పలు ప్రాంతాల నుంచి జనాల తరలింపు బాధ్యత యూసీడీ విభాగానికి అప్పగించారు. వారితోపాటు సచివాలయ సిబ్బంది విధులు నిర్వహిస్తారు. నగరం నుంచి మూడు లక్షలు, నాలుగు గ్రామీణ మండలాల నుంచి 25 వేల మంది, అనకాపల్లి జిల్లా నుంచి లక్ష మంది, విజయనగరం, శ్రీకాకుళం నుంచి 40 వేలు మందిని సమీకరించనున్నారు.

ప్రతిష్ఠాత్మకంగా యోగా దినోత్సవం

... 5వ పేజీ తరువాయి

అక్కడ నుంచే వెనక్కి చేరుకోవాలని ప్రజలకు వివరించాలన్నారు. బస్సులు, ఇతర వాహనాలకు ఇన్‌చార్జిలుగా సచివాలయ సిబ్బందిని నియమించామని, కార్యక్రమంలో మహిళలు, యువత ఎక్కువగా పాల్గొనేలా చూసుకోవాలని సూచించారు. సచివాలయం వారీగా కంపార్టుమెంట్ల కేటాయింపుపై ప్రతి బస్సుపై పూర్తి సమాచారం ఉండేలా స్టిక్కర్లు అతికిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.

2,085 బస్సుల ఏర్పాటు

యోగా దినోత్సవానికి ప్రజలను తరలించేందుకు 2,085 బస్సులు ఏర్పాటు చేస్తున్నామని హరేంధిర ప్రసాద్ వెల్లడించారు. ఆర్టీసీకి చెందిన 1300 బస్సులు ఉండగా... వీటిని నగరంలోని ప్రజలను తరలించేందుకు 800 బస్సులను, గ్రామీణ ప్రాంతానికి 500 బస్సులను కేటాయించామన్నారు. అలాగే 885 ప్రైవేటు బస్సులను సమకూర్చుతున్నామని, వీటితోపాటు ఆటోలు, టాటా మ్యాజిక్ వాహనాలను వినియోగించడం జరుగుతుందన్నారు. 20వతేదీ సాయంత్రానికే ఆయా నియోజకవర్గాలకు వాహనాలు చేరుకునేలా ఏర్పాటుచేస్తున్నామన్నారు. బస్సుల్లో వచ్చే వారంతా తెల్లవారుజాము ఐదు గంటలకు తమకు కేటాయించిన ప్రదేశాలకు చేరుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. యోగాలో పాల్గొన్న వారందరికీ టీషర్టులు, మ్యాట్‌లు అందజేస్తామన్నారు. కార్యక్రమం పూర్తయి తిరిగి వెళ్లేటప్పుడు ప్రతిఒక్కరికీ అరటిపండు, రెండు టాటా గ్లూకోజ్ ప్యాకెట్లు, పల్లీ చక్కీ, బిస్కెట్ ప్యాకెట్, వాటర్ బాటిల్ అందిస్తామని కలెక్టర్ వివరించారు. ఇతర జిల్లాల నుంచి వచ్చిన వారికి ఆయా జిల్లాల యంత్రాంగాలు అల్పాహారం అందించేలా ఏర్పాటు చేస్తున్నామన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారంతా ఆర్కే బీచ్ నుంచి విశాలాక్షినగర్ వరకు గల కంపార్టుమెంట్లకు వెళ్లాలని, పెందుర్తి, అనకాపల్లి నుంచి వచ్చేవారంతా ఎండాడ లా కళాశాల రోడ్డు గుండా బీచ్ రోడ్డు, విజయనగరం జిల్లా నుంచి వచ్చేవారు ఐటీ సెజ్ రోడ్డులోకి, శ్రీకాకుళం నుంచి వచ్చేవారు తిమ్మాపురం నుంచి భీమిలి వరకు గల కంపార్టుమెంట్లకు రావాలని హరేంధిర ప్రసాద్ సూచించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు పి.గణబాబు, పి.విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, మేయరు పీలా శ్రీనివాసరావు, ఏపీ కో-ఆపరేటివ్ ఆయిల్ ఫెడ్ గ్రోయర్స్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జి, ఎన్టీఆర్ వైద్య ట్రస్టు వైస్‌చైర్మన్ సీతంరాజు సుధాకర్, వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం ప్రణవ్‌గోపాల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెరుగుతున్న కోతలు

... 5వ పేజీ తరువాయి

చెబుతున్నారు. ఒకప్పుడు సాధారణ ప్రసవానికి గర్భిణి కుటుంబ సభ్యులు, బంధువులు మొగ్గు చూపించేవారు. కానీ ఇప్పుడు బిడ్డకు, తల్లికి ఇబ్బంది అవుతుందన్న భయం, ఇతర కారణాలతో సిజేరియన్ చేయాల్సిందిగా వారే అడుగుతున్నారంటున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు కూడా ఏదైనా జరిగితే విమర్శలు ఎదుర్కొనాల్సి వస్తుందనే ఉద్దేశంతో ఏ మాత్రం ఇబ్బంది అనిపించినా సిజేరియన్‌కు మొగ్గు చూపుతున్నారు. దీంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ భారీ సంఖ్యలో సిజేరియన్లు పెరుగుతున్నాయి.

ఇదీ లెక్క...

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో గడిచిన నాలుగేళ్లుగా పరిశీలిస్తే ప్రతి ముగ్గురు గర్భిణుల్లో ఒకరికి సిజేరియన్ చేస్తున్నారు. 2021-22 ఉమ్మడి విశాఖ జిల్లాలో 63,703 ప్రసవాలు జరగ్గా.. ఇందులో 18,216 సిజేరియన్ డెలివరీలే. ఇందులో ప్రభుత్వ ఆస్పత్రుల్లో 8,676, ప్రైవేటు ఆస్పత్రుల్లో 9,540 జరిగాయి. అలాగే 2022-23లో విభజిత విశాఖ జిల్లాలో 36,798 ప్రసవాలు జరగ్గా, ఇందులో సిజేరియన్లు 12,992. ప్రభుత్వ ఆస్పత్రుల్లో 7,358, ప్రైవేటు ఆస్పత్రుల్లో 5,634 సిజేరియన్లు చేశారు. 2023-24లో 37,511 ప్రసవాలు జరగ్గా... ఇందులో 15,077 సిజేరియన్లు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో 6,728, ప్రైవేటు ఆస్పత్రుల్లో 8,349 సిజేరియన్లు నిర్వహించారు. అదేవిధంగా 2024-25లో 30,832 ప్రసవాలు జరగ్గా.. వీటిలో 12,329 సిజేరియన్లు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో 6,253, ప్రైవేటు ఆస్పత్రుల్లో 6,076 జరిగాయి.

ప్రైవేటుకు సమానంగా 'కోతలు'

జిల్లాలో ప్రైవేటు ఆస్పత్రులతో సమానంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో కోతలు జరుగుతుండడం ఆందోళనను కలిగిస్తోంది. గడిచిన నాలుగేళ్లలో జిల్లాలో 1,68,844 ప్రసవాలు జరగ్గా... ఇందులో 58,614 సిజేరియన్లే ఉండడం గమనార్హం. వీటిలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో 29,015, ప్రైవేటు ఆస్పత్రుల్లో 29,599 జరిగాయి. అంటే.. ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో దాదాపు సమానంగానే జరిగాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సిజేరియన్ల సంఖ్య పెరుగుతుండడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. దీనిపై జిల్లా యంత్రాంగం ప్రత్యేకంగా దృష్టిసారించాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొంటున్నారు. ఇక ప్రైవేటు ఆస్పత్రులకు సిజేరియన్ ప్రసవాలు కాసులు కురిపిస్తున్నాయి. సిజేరియన్‌కు ఆస్పత్రి స్థాయిని బట్టి కనీసం రూ.80 వేల నుంచి రెండు లక్షల రూపాయల వరకు వసూలు చేస్తున్నారు. ప్రసవం తరువాత తల్లి, బిడ్డ ఆరోగ్యాన్ని బట్టి ఈ మొత్తం మరింత పెరిగే అవకాశం కూడా ఉంది.

డిఫెన్స్ మద్యం బాటిళ్లు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

విశాఖపట్నం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నగరంలో అనధికారికంగా డిఫెన్స్ మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ అధికారులు అరెస్టు చేశారు. నిందితుని వద్ద నుంచి 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. మహారాణిపేట ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ సీఐ రవికిరణ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

చావులమదుం వద్ద ఓ వ్యక్తి మద్యం విక్రయిస్తున్నట్టు ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్‌.ప్రసాద్‌కు సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ అధికారులు నిఘా పెట్టారు. ఈ క్రమంలో డిఫెన్స్ మద్యం బాటిళ్లను విక్రయించేందుకు యత్నిస్తున్న కాపు మురళీమోహన్ (38)ను అదుపులోకి తీసుకున్నారు. మురళీమోహన్ నేవల్ డాక్‌యార్డ్‌లో 15 ఏళ్లుగా కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్నాడన్నారు. తనకున్న పరిచయాలతో ఈ మద్యం బాటిళ్లను సేకరించి అధిక ధరలకు విక్రయిస్తున్నాడు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ ఆదివారం తెలిపారు.


స్వాధీనం చేసుకున్న డిఫెన్స్ మద్యం బాటిళ్లతో ఎక్సైజ్ అధికారులు

ప్రమాదమని తెలిసీ.. విన్యాసంగా చేపల వేట

సాగర తీరంలో కొందరు యువకులు చేసే చేష్టలు ప్రమాదకరంగా ఉంటాయి. తేడా జరిగితే ప్రాణాలు పోతాయని తెలిసీ కొందరు యువకులు సముద్రం లోపలకు వెళుతూ విన్యాసాలు చేస్తుంటారు. ఆదివారం ఆర్కే బీచ్ వద్ద కొందరు యువకులు చేసిన విన్యాసాలు అలా ప్రమాదకరంగానేఅనిపించాయి. పెద్ద ఎత్తున ఎగిసి పడుతున్న అలలకు ఎదురుగా వెళ్లి గాలం వేసి చేపలు పట్టే ప్రయత్నం చేశారు కొందరు యువకులు. ఆ యువకులు చేపలు బాగానే పడుతున్నా.. అలలు తీవ్రతను చూసిన కొందరు ఆందోళన చెందారు. ఇటువంటి ప్రమాదకర చేష్టలు అవసరమా.? అంటూ పలువురు వ్యాఖ్యానించారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



రూ.1.15 కోట్లతో కొండవాలు ప్రాంతాల్లో అభివృద్ధి

» భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, పాల్గొన్న 15వ వార్డు కార్పొరేటర్ శ్రీవిద్య తదితరులు

వెంకోజీపాలెం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 15వ వార్డులోని భీమిలి నియోజకవర్గానికి చెందిన నరసింహనగర్, బల్లంకి కొండవాలు ప్రాంతంలో రూ.కోటి 15 లక్షలతో పలు అభివృద్ధి పనులకు బీమిలి నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్యలు ఆదివారం శంకుస్థాపన చేశారు. జీవీఎంసీ నిధులతో కొండవాలు ప్రాంతంలోని రక్షణ గోడలు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పునరుద్ధరణ, మంచినీటి వసతులను కల్పించనున్నట్టు కార్పొరేటర్ శ్రీవిద్య తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలోనూ, కనీస సౌకర్యాలను కల్పించడంలోనూ టీడీపీ ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జోన్-3 జోనల్ కమిషనర్ శివప్రసాద్, ఈఈ గంగాధర్, ఏఈ భాగ్యశ్రీ, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్, టీడీపీ వార్డు అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, అప్పారి గిరిబాబు, నరసింహనగర్ గ్రామ అధ్యక్షుడు నర్సింగరావు, మహేష్, జనసేన వార్డు అధ్యక్షురాలు యడ్ల కళావతి, టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు బోను సూరిబాబు, కణితి నాగరాజు, సీఎం నాయుడు, వార్డు టీడీపీ మహిళా అధ్యక్షురాలు వరలక్ష్మి, సన్యాసమ్మ, కర్రి గౌరీ తదితరులు పాల్గొన్నారు.

జూలో 8 పిల్లలను పొదిగిన నెమలి


తల్లితో ఉన్న నెమలి పిల్లలు

ఆరిలోవ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాలలో గల నెమలి 8 పిల్లలను గుడ్ల నుంచి పొదింగింది. నెమలి 12 గుడ్లను పొదగగా, వాటినుంచి 8 పిల్లలు వచ్చినట్టు జూ క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. వాతావరణం కూడా అనుకూలంగా ఉండడంతో 8 పిల్లలు కలిగాయని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం నెమలి పిల్లలు 15 రోజుల ప్రాయంలో ఉన్నాయ న్నారు. వీటిని తల్లి నెమలితో పాటు ప్రత్యేక సంరక్షణ చేపడుతున్నట్టు జ్యూ క్యూరేటర్ తెలిపారు.

పకడ్బందీగా యోగాంధ్ర ఏర్పాట్లు

» కాళీమాత ఆలయం నుంచి పార్కు హోటల్ వరకు ప్రధాన కార్యక్రమం
» ఒకవేళ వర్షం పడితే ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ మైదానంలో ప్రధాన వేడుక
» ప్రధాన వేదిక వద్ద జరిగే ఏర్పాట్లపై సమీక్షించి, అధికారులకు దిశానిర్దేశం చేసిన వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్


పలు శాఖ అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్

సిరిపురం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ యోగా దినోత్సవం ఈ నెల 21న నిర్వహించనున్న నేపథ్యంలో కాళీమాత ఆలయం నుంచి పార్కు హోటల్ వరకు ఉండే రెండు కిలోమీటర్ల ప్రాంతం ప్రధాన వేదిక కానుందని, ఒకవేళ వర్షం పడితే ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ప్రధాన కార్యక్రమం కొనసాగుతుందని. ఇందుకు అనుగుణంగా అధికారులు సంసిద్ధంగా ఉంటూ పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ప్రధాన వేదిక ఇన్‌చార్జ్ అధికారి, వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ పేర్కొన్నారు. ప్రధాన వేదిక వద్ద ప్రజలతో కలిసి కింద భాగంలోనే ప్రధాని, గవర్నర్, ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం ఇతర ప్రముఖులు యోగాసనాలు వేస్తారని తెలిపారు. ప్రధాన వేదిక వద్ద జరిగే ఏర్పాట్లపై ఆయా కంపార్ట్‌మెంట్ ఇన్‌చార్జ్ అధికారులతో కలిసి ఆదివారం సాయంత్రం వీఎంఆర్డీఏ 9వ ఫ్లోర్‌లో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. తాగునీరు, ఆహారం, టీ షర్టులు, యోగా మ్యాట్ల పంపిణీ, క్యూఆర్ కోడ్ ద్వారా లెక్కింపు, వైద్య సదుపాయాల కల్పన, రూట్‌మ్యాప్‌లు, వలంటీర్ల సేవలు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. బీచ్‌రోడ్డులో రెండు కిలో మీటర్లు సాగే కార్యక్రమంలో 12 కంపార్ట్‌మెంట్‌లో వెయ్యి మంది చొప్పున ఉంటారని, బీచ్‌రోడ్డులో వేసే అదనపు కంపార్ట్‌మెంట్‌లతో కలిసి 15 వేల పైచిలుకు ప్రజలు భాగస్వామ్యం అవుతారని పేర్కొన్నారు. ప్రధాన వేదిక తరువాత సీ1 కంపార్ట్‌మెంట్ ప్రారంభమవుతుందని, పార్కు హోటల్ వరకు మొత్తం 12 కంపార్ట్‌మెంట్లు ఉంటాయని, సీ6 వరకు ఉండే కంపార్ట్‌మెంట్లలో 9 వేల మంది ఇండియన్ నేవీ, కోస్ట్‌గార్డు సిబ్బందితో పాటు యోగా స్టూడెంట్స్, యోగా అసోసియేషన్ సభ్యులు, వివిధ స్థాయిల్లో యోగా పోటీల్లో విజేతలుగా నిలిచిన వారు పాల్గొంటారని స్పష్టం చేశారు. వీఐపీలంతా వీఎంఆర్డీఏకు వేకువజామున 4.30 గంటలకు చేరుకుంటారని, వారిని ఉదయం 5.40 గంటలలోపు కంపార్ట్‌మెంట్లకు చేర్చాలని అధికారులకు నిర్దేశించారు. వివిధ విభాగాల జిల్లాఅధికారులు, కంపార్ట్‌మెంట్ల ఇన్‌చార్జ్ అధికారులు పాల్గొన్నారు.

భద్రతకు అత్యంత ప్రాధాన్యమివ్వాలి : డీఆర్ఎం లలిత్ బొహ్రా

విశాఖపట్నం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రైల్వే ఆస్తుల పరిరక్షణ, ప్రయాణికులకు సురక్షిత ప్రయాణం అందించడంలో భాగంగా భద్రతకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని వాల్తేరు రైల్వే డీఆర్ఎం లలిత్ బొహ్రా పేర్కొన్నారు. ఆదివారం సింహాచలం నార్త్ క్రూ లాబీలో జరిగిన వాల్తేరు రైల్వేలో భద్రతా ప్రమాణాల పెంపుపై జరిగిన సదస్సుకు ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భద్రతకు ప్రాధాన్యనివ్వడంలో ఎటువంటి రాజీ పడకూడదని పేర్కొన్నారు. భద్రత నిర్వహణలో లోపాలు ఏర్పడితే తక్షణ చర్యలు చేపట్టి పునరుద్దరించడంతోపాటు ప్రమాణాలు పెంపుకు కృషి చేయాలన్నారు.

విమాన ప్రమాద మృతులకు నివాళి



నివాళి అర్పిస్తున్న నరవ ప్రకాశరావు, బాలవికాస్ ఫౌండేషన్ సభ్యులు

వెంకోజీపాలెం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో చనిపోయిన వారి ఆత్మలకు శాంతి కలగాలని కోరుతూ ఆదివారం హెచ్‌బీ కాలనీ జంక్షన్‌లో బాలవికాస్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బాల వికాస ఫౌండేషన్ వ్యవస్థాపక గౌరవ కార్యదర్శి నగర ప్రకాశరావు మాట్లాడుతూ జరిగిన సంఘటన చాలా దురదృష్టకరమని, భవిష్యత్తులో పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. చనిపోయిన వారి ఆత్మలకు శాంతి కలగాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాబ్జీ, బి.గణేష్, పీఎస్వీ కుర్మేష్, డి.రమణమూర్తి, ఎ.రామకృష్ణ, బి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సింహాచలం దేవస్థానంలో ఏఈవోల బదిలీ

సింహాచలం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం దేవస్థానంలో పలువురు ఏఈఓలను బదిలీ చేస్తూ ఈఓ వేంద్ర త్రినాథరావు ఉత్తర్వులు జారీ చేశారు. 20 రోజుల క్రితం ఆలయ ఏఈఓగా ఉన్న ఎన్.ఆనందకుమార్‌ను అన్నప్రసాద విభాగానికి, అన్నప్రసాద విభాగంలో పని చేస్తున్న ఏఈవో పిళ్లా శ్రీనివాసరావును అప్పన్న ఆలయ ఏఈఓగా బదిలీ చేస్తూ ఉత్తర్వులిచ్చారు. నెల కూడా గడవక ముందే రెండు రోజుల క్రితం మరోసారి ఏఈఓల బదిలీలకు ఈఓ ఆదేశాలివ్వడం చర్చనీయాంగా మారింది. తాజా ఉత్తర్వుల ప్రకారం.. ప్రస్తుతం డిప్యూటీ ఈఓగా పనిచేస్తున్న సింగం రాధను దేవాలయ ఏఈఓగా నియమించారు. గత కొన్నేళ్లుగా దేవస్థానం న్యాయ విభాగంలో పనిచేస్తున్న ఏఈఓ విబి రమణమూర్తిని అక్కడి నుంచి తప్పించారు. రమణమూర్తికి ఆగమ పాఠశాల, నృశింహవనం నిర్వహణ విధులు కేటాయించారు. ప్రస్తుతం అకౌంట్స్, లీగల్ ప్రత్యుత్తరాలు విభాగాలను చూస్తున్న నరసింహరాజును వాటి నుంచి తప్పించి భూముల పరిరక్షణ, ప్రింటింగ్ అండ్ స్టేషనరీ, ఆర్‌టీఐ విభాగాలకు బదిలీ చేశారు. ఆలయ ఏఈఓగా పనిచేస్తున్న పిళ్లా శ్రీనివాసరావును భైరవస్వామి ఆలయం, నిద్దాం భూములు, ఆడిట్, అప్పన్న పూదోట పరిరక్షణతో పాటు 275 సర్వే నంబర్‌లోని భూముల పరిరక్షణ విభాగాలకు కేటాయించారు. అన్నప్రసాద విభాగం ఏఈఓగా ఉన్న ఎన్ ఆనందకుమార్‌కు ప్రజా సంబంధాల విభాగాన్ని అదనంగా అప్పగించారు. 20 రోజుల వ్యవధిలో ఏఈఓల మార్పులు ఎం దుకు అన్న దానిపై దేవస్థానం ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.

జీవో నం.229తో పంచగ్రామాల భూ సమస్యకు చెక్



శిబిరం వద్ద మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర పరిరక్షణ వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ

సింహాచలం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం దేవస్థానానికి సంబంధించిన పంచ గ్రామాల భూ వివాద పరిష్కారానికి 2019లో టీడీపీ ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబరు 229ను అమలు చేయాలని సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి టీవీ కృష్ణంరాజు డిమాండ్ చేశారు. ఆదివారం ఆ సంఘం ఆధ్వర్యంలో పంచ గ్రామాల భూవివాద పరిష్కారాన్ని కోరుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టు పేరుతో ప్రభుత్వం ఈ సమస్యపై కాలయాపన చేస్తోందని, రెవెన్యూ, దేవదాయ శాఖలు సమగ్రంగా చర్చించి, తగిన పరిష్కారం చూపడం అంత కష్టమేమీ కాదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయినా సమస్య పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర పరిరక్షణ వేదిక ప్రధాన కార్యదర్శి ఏ.అజశర్మ, వీబీఎన్ ప్రతాప్, బి.రమణి, సీహెచ్ఎస్ గోపాలకృష్ణ, సత్యనారాయణ, ముద్దాడ వరప్రసాద్, బి.శంకరరావు పాల్గొన్నారు.

వివాదాల్లో తలదూర్చొద్దు

» రౌడీషీటర్లకు ఎంవీపీ పోలీసుల కౌన్సెలింగ్


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ ధనుంజయనాయుడు

ఎంవీపీ కాలనీ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : వివాదాల్లో తలదూర్చి, ఇబ్బందులకు గురికావొద్దని రౌడీషీటర్లను ఎంవీపీ పోలీసులు హెచ్చరించారు. ఎంవీపీ కాలనీ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు ఆదివారం ఎస్ఐ ధనుంజయనాయుడు కౌన్సిలింగ్ నిర్వహించారు. సత్ప్రవర్తన ద్వారా రౌడీ షీట్లు తొలగించే అవకాశం ఉంటుందని, మళ్లీ గొడవలు చేస్తే, జైలు పాలవ్వాల్సి వస్తుందని స్పష్టం చేశారు. ఇటీవల శాంతి ఆశ్రమం విషయంలో కలుగజేసుకున్న రౌడీ షీటర్లు కారాగారంలో ఊచలు లెక్కపెడుతున్నారన్న విషయం గమనించి అందరూ జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. చిన్న తగాదాల్లో కలుగజేసుకున్నా గట్టి చర్యలు తీసుకోమంటూ పోలీసు కమిషనర్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారన్నారు. ఈ నేపథ్యంలో మితిమీరి ప్రవర్తించవద్దంటూ సూచించారు.

సినిమా గైడ్

- ● డ్రాగన్ 3డి : జగదాంబ
- ● బల్లెరినా : రమాదేవి
- ● గేంబ్లర్స్ : శారద
- ● థగ్ లైఫ్ : మెలోడి, సంగం, కామేశ్వరి, శ్రీరామా, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం) అరుణ (పెదగంట్యాడ)
- ● భైరవం: శ్రీకన్య, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక)
- ● సింగిల్ : గోకుల్, మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- ● శుభం: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 24, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 18, పచ్చిమిర్చి, కాకరకాయలు 34, బీరకాయలు 32, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 18, క్యారెట్ 40 దొండకాయలు 20, బంగాళదుంపలు 19, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 54, అల్లం (పాతది)52, బరబాటి 30, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 70,బద్దచిక్కుడు 50, దోస కాయలు 16, వె ల్లుల్లి (పెద్దవి) 90, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 80, కీరదోస 30, కాప్సికమ్ 68, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 36, చిలగడదుంపలు 30, కంద 56, దేముడుచిక్కుడు 56, గోరు చిక్కుడు 38, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 4 , చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	83
లైవ్ ధర	103
విత్ స్కిన్	176
స్కిన్‌లెస్	186

సీఎం పర్యటనకు ట్రయల్ రన్


ట్రయల్ రన్ నిర్వహిస్తున్న దృశ్యం

విశాఖపట్నం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోమవారం నగర పర్యటన నేపథ్యంలో ముందస్తు భద్రతా వాహన శ్రేణి ట్రయల్ రన్‌ను ఆదివారం నిర్వహించారు. విశాఖ విమానాశ్రయం నుంచి ముఖ్యమంత్రి పర్యటించే నోవాటెల్, ఆర్కే బీచ్, ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్స్, పీఎంపాలెం మీదుగా ఈ ట్రయల్ రన్ నిర్వహించారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీసీపీలు అజిత, మేరీ ప్రశాంతి, ఆర్డీవోశ్రీలేఖ విమానాశ్రయంలో పలువురు అధికారులతోభద్రతాఏర్పాట్లపై సమీక్షించారు.

జూకు సందర్శకుల తాకిడి

ఆరిలోవ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాల ఆదివారం సందర్శకులతో కిటకిటలాడింది. సుమారు 5,900 వేల మంది సందర్శకులు వచ్చినట్టు జూ క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. వీరి నుంచి రూ.4 లక్షల 91 వేల 590 రూపాయల ఆదాయం సమకూరిందని ఆమె చెప్పారు. ఆదివారం సెలవు రోజు కావడంతో పాటు వాతావరణం ఆహ్లాదకరంగా ఉండడంతో సందర్శకులు జూకు అధిక సంఖ్యలో వచ్చినట్టు చెప్పారు.


జూలో సందర్శకుల సందడి

జీవీఎంసీ కాంట్రాక్టర్లు యోగా సాధన

సిరిపురం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : యోగాంధ్రలో భాగంగా జీవీఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ తరఫున నిర్వహించిన యోగా కార్యక్రమానికి జీవీఎంసీ కాంట్రాక్ట్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.ఉదయం 5.30 నుంచి 8.30 వరకు జీవీఎంసీ స్విమ్మింగ్‌పూల్, అక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్, బీచ్ తదితర ప్రాంతాల్లో నిర్వహించినట్టు ప్రధాన కార్యదర్శి ఎం.సంజీవరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పీవీవీ నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఎం.సంజీవరెడ్డి, గుర్రం సింహాచలం, మద్దాల రమేష్, సిరికి శ్రీనివాసరావు, షేక్ సిలార్, పి.అప్పలరాజు, కె.వెంకట్రావు, ఏ.కాశీవిశ్వేశ్వరరావు, వైఈవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


ఆసనాలు వేస్తున్న కాంట్రాక్ట్ అసోసియేషన్ ప్రతినిధులు

సీఎం చంద్రబాబుతోనే స్వర్ణాంధ్ర సాధ్యం : బీవీ రామ్

సిరిపురం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి):ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ద్వారానే స్వర్ణాంధ్రప్రదేశ్ సాధ్యమని తెలుగుశక్తి అధ్యక్షుడు బీవీ రామ్ అన్నారు. ఆదివారం సాయంత్రం మేఘలయా హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అపెరల్ పార్కు పునరుద్ధరణకు ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. 2017 జీఎస్టీ ఏర్పాటైందని, అంతకుముందు ఉన్న వ్యాట్ ఆదాయం కేంద్రం ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి వదిలేసిందన్నారు. ఆ నిధులు రాబట్టడంలో అధికారులు నిర్లక్ష్యం వలన అలాగే ఉండిపోయాయన్నారు. వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ద్వారా పెనాల్టీ రద్దు చేస్తే రూ.5 వేల కోట్లు వస్తుందన్నారు. చిన్న ఎంటర్‌ప్రైజర్స్‌ను అభివృద్ధి కోసం అధికారులు దృష్టి సారించాలన్నారు.

అలరించిన రమ్య కిరణ్మయి గాత్ర కచేరి

మద్దిలపాలెం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియంలో త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన గాత్ర కచేరి అలరించింది. ప్రముఖ గాత్ర విద్వంసురాలు రమ్య కిరణ్మయి పలు కీర్తనలు ఆలపించి మంత్రముగ్దులను చేశారు. నాటరాగ వర్ణం రాగంలో 'ఏ నాదములో..', ఆరభి రాగంలో 'చాలకల్లలాడుతున్న..' రీతిగౌళ రాగంలో 'పరిపాలనయమాం..' మోహన రాగంలో 'రాగం తానం పల్లవి..' పాటలు పాడి అలరించారు. కచేరీలో ఎంఎస్ ఎన్ మూర్తి వయోలిన్, పారుపల్లి ఫాల్గుణ మృదంగం వాయిద్య సహకారం అందించారు. ముందుగా ట్రస్ట్ అధ్యక్షుడు ఎంఎస్ఎన్ రాజు, కార్యదర్శి రాంబాబు, పంతుల గోపాలరావు, గౌరి రామ్మోహనరావు, రమ జ్యోతి ప్రజ్వాలన చేసి కచేరి ప్రారంభించారు.



నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

భీమునిపట్నం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : భీమిలి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల దృష్ట్యా సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్ 3 ఈఈ శ్రీనివాసరావు తెలిపారు. కొత్తవలస, జేవీఅగ్రహారం, నిడిగట్టు, చిలుకూరి లేఅవుట్, విలాసం లేఅవుట్, పెద ఉప్పాడ, చినఉప్పాడ, గంగడిపాలెం, గోవుపేట, కొత్తూరులకు సరఫరా ఉండదని చెప్పారు.

సాయి ధ్యానమందిరంలో సంగీత విభావరి


గీతాలాపన చేస్తున్న గాయకులు

అక్కయ్యపాలెం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 26వ వార్డు రామకృష్ణానగర్ లోని షిర్డీ సాయి ధ్యానమందిరంలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం సాయి భజన బృందం ఆధ్వర్యంలో సంగీత విభావరి జరిగింది. ఈ మేరకు సాయి ఏకం, సాయి భజనలు, సాయి పాటలతో పాటు డోలక్‌తో సంగీత కళాకారులు భక్తులను అలరించారు. అలాగే మధ్యాహ్నం భక్తులకు అన్న సమారాధన, సాయంత్రం అల్పాహారం అందించారు. కార్యక్రమంలో బృందం అధినేత మంగవేణి, డోలకిస్ట్ రాము ఈశ్వరరావు, కర్రి జగన్నాథరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేత యూబీఐ


విజేతగా నిలిచిన యూనియన్ బ్యాంకు జట్టు

సీతమ్మధార, జూన్ 15, (ఆంధ్రజ్యోతి) : నగరంలోని గల బ్యాంకులు అన్ని కలిసి నిర్వహించిన బ్యాంకర్స్ క్రికెట్ టోర్నమెంట్‌లో ఫైనల్ మ్యాచ్‌లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విజయం సాధించింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు టీమ్‌తో తలపడి 6 వికెట్ల తేడాతో గెలిచింది. టోర్నీలో మొత్తం 12 జట్లు పాల్గొన్నాయి.

మౌలిక వసతుల కల్పనకు కృషి

కార్పొరేటర్ గంకల కవిత

కంచరపాలెం,జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 48వ వార్డులో పూర్తి స్థాయిలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్టు కార్పొరేటర్ గంకల కవిత పేర్కొన్నారు. ఇందిరానగర్-1, జైభారత్ నగర్ తదితర ప్రాంతాల్లో ఆదివారం కవిత పర్యటించి ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతు పారిశుధ్యం, వీధి దీపాల ఏర్పాటు, సామాజిక భవనాల నిర్మాణం తదితర అభివృద్ధి పనులను ప్రత్యేక చొరవతో చేస్తున్నట్టు తెలిపారు. జైభారత్ నగర్‌లో మల్టీపర్పస్ కమ్యూనిటీ హాలును త్వరలో ప్రారంభించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంకల అప్పారావు పాల్గొన్నారు.


స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ కవిత

ఆహార ప్యాకెట్ల పంపిణీ


ఆహార ప్యాకెట్లు అందిస్తున్న నిర్వాహకులు

అక్కయ్యపాలెం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 26వ వార్డు శంకువానిపాలెంలోని వాగ్దేవి పాఠశాల ప్రాంగణంలో నిత్యాన్నదానంలో భాగంగా ఆదివారం నిరుపేదలకు ఆహార ప్యాకెట్లను ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నార్తులకు, నిరుపేదలకు క్రమం తప్పకుండా గత 13 ఏళ్ళ నుంచి నిర్విరామంగా ప్రతి ఆదివారం ఆహార ప్యాకెట్లను పంపిణీ చేయడం అభినందనీయమని నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో ఎంవీవీ సత్యనారాయణ, ఎంఎస్ఎల్ శైలజ, లయన్స్ క్లబ్ సభ్యులు, భారత్ వికాస్ పరిషత్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి చదరంగం టోర్నీ

విశాఖపట్నం, స్పోర్ట్స్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ఆల్ విశాఖ చెస్ సంఘం, శ్రీ చెస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి అండర్-15 ఓపెన్ బాలుర బాలికల చెస్ టోర్నీ కమ్ జిల్లా జట్టు ఎంపికలు ఆదివారం ముగిశాయి. ద్వారకానగర్ బీవీకే కళాశాలలో జరిగిన ఈ టోర్నీ బాలుర ఓపెన్ కేటగిరిలో కృష్ణ వరన్య పొట్నూరు, ఉద్దవ్ లక్ష్మణ్, పిన్నమరాజు అనిరుధ్, హర్షవర్ధన్ యాదవ్ తొలి నాలుగు స్థానాల్లో నిలిచారు. అలాగే బాలికల ఓపెన్ కేటగిరిలో పోటునూర్ సాత్విక, లక్ష్మీప్రియ బట్ట, దివ్యదర్శిని మోయిదా, అఫ్షీన్ మహ్మద్ తొలి నాలుగు స్థానాలను దక్కించుకున్నారు. బాలుర బాలికల విభాగాల్లో తొలి నాలుగు స్థానాలలో నిలిచిన వారు త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి చెస్ టోర్నీలో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని అసోసియేషన్ కార్యదర్శి ఎస్.మణికంఠరావు తెలిపారు. టోర్నీ ముగింపు కార్యక్రమానికి బీవీకే కళాశాల ప్రిన్సిపాల్ రత్నశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, ధ్రువపత్రాలు అందజేసి అభినందించారు.


విజేతలుగా నిలిచిన విద్యార్థులు

పద్మశాలీ గ్లోబల్ యాప్ ఆవిష్కరణ

సీతంపేట, జూన్ 15, (ఆంధ్రజ్యోతి) : పద్మశాలీలు అభ్యున్నతికి పద్మశాలీ గ్లోబల్ యాప్ ఎంతో ఉపయోగపడుతుందని, ఈ యాప్ ద్వారా ఎక్కడి నుంచైనా పద్మశాలీలు అంతా ఒక్కతాటిపైకి వచ్చి వారి సమస్యలను తెలుపుతూ పరిష్కారం, సహాయం పొందవచ్చని పద్మశాలి గ్లోబల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బెంగుళూరు ఇన్‌ఫ్రాస్ట్రెక్చర్ కంపెనీల కన్సల్టెంట్ అండ్ టెక్నికల్ డైరెక్టర్ మెరువ వెంకటేశ్వర్లు, స్వాతి సైన్స్ ఒంగోలు అండ్ హైదరాబాద్ చైర్మన్ కవరతపు ప్రసాదరావు, కర్నూలు మాజీ పార్లమెంటు సభ్యులు డాక్టర్ సింగరి సంజీవ్‌కుమార్, రో ఎన్ ఐటీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఒంగోలు డైరెక్టర్ గోలి తిరుపతిరావులు తెలిపారు. సీతంపేటలోని మధురానగర్‌లో శంకరమఠం ఎదురుగా గల పద్మశాలీ భవన్‌లో విశాఖ జిల్లా పద్మశాలీల ఆత్మీయ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ముందుగా భక్తమార్కండేయ చిత్రపటం వద్ద వందనాలు సమర్పించారు.


యాప్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పద్మశాలి గ్లోబల్ ట్రస్ట్ ప్రతినిధులు

అనంతరం పద్మశాలీల కుటుంబాలకు అసరాగా ఉండే పద్మశాలీల గ్లోబల్ యాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ పద్మశాలి గ్లోబల్ యాప్ సమాచారం కోసం పద్మశాలి గ్లోబల్‌ట్రస్ట్ ఎట్ ది రేట్ ఆఫ్ జిమెయిల్ డాట్ కం ద్వారా సమాచారం తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పద్మశాలీ నాయకులు పప్పు రాజారావు, సూరిశెట్టి సూరిబాబు, బురిడి కళ్యాణి, కొప్పుల రమేష్, వాసపల్లి ఈశ్వరరావు, రాపర్తి సుబ్బారావు, కొప్పల రామ్‌కుమార్, కోడిదాసు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

త్రీస్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి నడక పోటీలు

కంచరపాలెం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రాంగణంలో గల త్రీస్టార్స్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా స్థాయి 4 కిలోమీటర్ల నడకపోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో 30 సంవత్సరముల నుంచి 80 ఏళ్ల వయస్సు గల యువత, వృద్ధులు, మహిళలు చురుగ్గా పాల్గొన్నారు. పోటీలను క్లబ్ అధ్యక్షులు జయతి ఉమామహేశ్వరరావు, గౌరవాధ్యక్షులు పి. సుకుమార్, కార్యదర్శి కాళ్ల వెంకటప్రసాద్‌తో పాటు ఇతర కమిటీ సభ్యులు జెండాను ఊపి ప్రారంభించారు. వయసులు వారీగా ఆయా విభాగాల వారికి పోటీలను నిర్వహించి విజేతలను అభినందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా 101 ప్రెసిడెంట్ ద్వారకారావు మాట్లాడుతూ నడకతోనే సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందన్నారు.పోటీల్లో పాల్గొన్న మహిళలు, వృద్ధులను అభినందించారు.


పోటీలను ప్రారంభిస్తున్న క్లబ్ ప్రతినిధులు

యోగా బడ్జెట్ రూ.62 కోట్లు!

... 5వ పేజీ తరువాయి

ప్రభుత్వం రూ.20 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో పలుమార్లు నిధుల కోసం జీవోలు వచ్చినా డబ్బులు విడుదల కాని సందర్భాలు ఉన్నాయి. దీంతో జిల్లా యంత్రాంగం నిధుల కోసం ఎదురుచూస్తోంది. మ్యాట్లు, టీషర్టులను కేంద్రం సరఫరా చేస్తుండంతో ప్రభుత్వానికి కొంత భారం తగ్గింది.

భారీ సంఖ్యలో అధికారుల నియామకం

యోగా దినోత్సవ నిర్వహణకు సంబంధించి ఏడుగురు ఐఏఎస్‌లు, ఏడుగురు ఐపీఎస్ అధికారులు, 31 మంది డిప్యూటీ కలెక్టర్లు, 101 మంది తహశీల్దార్లు, ఏడుగురు జిల్లా పౌరసరఫరాల అధికారులను నియమించారు. వీరికితోడు ఆర్టీసీ, రవాణా అధికారులు, భారీ స్థాయిలో పోలీసులను నియమించడంతో వారందరికీ వసతి, వాహన సౌకర్యంపై అధికారులు దృష్టి సారించారు. ఇంకా అమరావతి నుంచి పలువురు సీనియర్ అధికారులు వస్తున్నారు. మొత్తం 268 కంపార్టుమెంట్లకు గజిటెడ్ అధికారులను ఇన్‌చార్జిలుగా, వారికి సహాయం చేసే సిబ్బందిని నియమించారు. కంపార్టుమెంట్లలో సేవలందించేందుకు ఆరువేల మంది ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, వైజాగ్ వలంటీర్లను నియమించారు. కంపార్టుమెంట్‌లోకి వచ్చే ప్రతిఒక్కరికీ చేతికి ఉండే బ్యాడ్జిని వలంటీర్లు స్కాన్ చేస్తారు. గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు కోసం స్కానింగ్ అవసరమని గుర్తించారు. నగరంలో పలు ప్రాంతాల నుంచి జనాల తరలింపు బాధ్యత యూసీడీ విభాగానికి అప్పగించారు. వారితోపాటు సచివాలయ సిబ్బంది విధులు నిర్వహిస్తారు. నగరం నుంచి మూడు లక్షలు, నాలుగు గ్రామీణ మండలాల నుంచి 25 వేల మంది, అనకాపల్లి జిల్లా నుంచి లక్ష మంది, విజయనగరం, శ్రీకాకుళం నుంచి 40 వేలు మందిని సమీకరించనున్నారు.

ప్రతిష్ఠాత్మకంగా యోగా దినోత్సవం

... 5వ పేజీ తరువాయి

అక్కడ నుంచే వెనక్కి చేరుకోవాలని ప్రజలకు వివరించాలన్నారు. బస్సులు, ఇతర వాహనాలకు ఇన్‌చార్జిలుగా సచివాలయ సిబ్బందిని నియమించామని, కార్యక్రమంలో మహిళలు, యువత ఎక్కువగా పాల్గొనేలా చూసుకోవాలని సూచించారు. సచివాలయం వారీగా కంపార్టుమెంట్ల కేటాయింపుపై ప్రతి బస్సుపై పూర్తి సమాచారం ఉండేలా స్టిక్కర్లు అతికిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.

2,085 బస్సుల ఏర్పాటు

యోగా దినోత్సవానికి ప్రజలను తరలించేందుకు 2,085 బస్సులు ఏర్పాటు చేస్తున్నామని హరేంధిర ప్రసాద్ వెల్లడించారు. ఆర్టీసీకి చెందిన 1300 బస్సులు ఉండగా... వీటిని నగరంలోని ప్రజలను తరలించేందుకు 800 బస్సులను, గ్రామీణ ప్రాంతానికి 500 బస్సులను కేటాయించామన్నారు. అలాగే 885 ప్రైవేటు బస్సులను సమకూర్చుతున్నామని, వీటితోపాటు ఆటోలు, టాటా మ్యాజిక్ వాహనాలను వినియోగించడం జరుగుతుందన్నారు. 20వతేదీ సాయంత్రానికే ఆయా నియోజకవర్గాలకు వాహనాలు చేరుకునేలా ఏర్పాటుచేస్తున్నామన్నారు. బస్సుల్లో వచ్చే వారంతా తెల్లవారుజాము ఐదు గంటలకు తమకు కేటాయించిన ప్రదేశాలకు చేరుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. యోగాలో పాల్గొన్న వారందరికీ టీషర్టులు, మ్యాట్‌లు అందజేస్తామన్నారు. కార్యక్రమం పూర్తయి తిరిగి వెళ్లేటప్పుడు ప్రతిఒక్కరికీ అరటిపండు, రెండు టాటా గ్లూకోజ్ ప్యాకెట్లు, పల్లీ చక్కీ, బిస్కెట్ ప్యాకెట్, వాటర్ బాటిల్ అందిస్తామని కలెక్టర్ వివరించారు. ఇతర జిల్లాల నుంచి వచ్చిన వారికి ఆయా జిల్లాల యంత్రాంగాలు అల్పాహారం అందించేలా ఏర్పాటు చేస్తున్నామన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారంతా ఆర్కే బీచ్ నుంచి విశాలాక్షినగర్ వరకు గల కంపార్టుమెంట్లకు వెళ్లాలని, పెందుర్తి, అనకాపల్లి నుంచి వచ్చేవారంతా ఎండాడ లా కళాశాల రోడ్డు గుండా బీచ్ రోడ్డు, విజయనగరం జిల్లా నుంచి వచ్చేవారు ఐటీ సెజ్ రోడ్డులోకి, శ్రీకాకుళం నుంచి వచ్చేవారు తిమ్మాపురం నుంచి భీమిలి వరకు గల కంపార్టుమెంట్లకు రావాలని హరేంధిర ప్రసాద్ సూచించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు పి.గణబాబు, పి.విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, మేయరు పీలా శ్రీనివాసరావు, ఏపీ కో-ఆపరేటివ్ ఆయిల్ ఫెడ్ గ్రోయర్స్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జి, ఎన్టీఆర్ వైద్య ట్రస్టు వైస్‌చైర్మన్ సీతంరాజు సుధాకర్, వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం ప్రణవ్‌గోపాల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెరుగుతున్న కోతలు

... 5వ పేజీ తరువాయి

చెబుతున్నారు. ఒకప్పుడు సాధారణ ప్రసవానికి గర్భిణి కుటుంబ సభ్యులు, బంధువులు మొగ్గు చూపించేవారు. కానీ ఇప్పుడు బిడ్డకు, తల్లికి ఇబ్బంది అవుతుందన్న భయం, ఇతర కారణాలతో సిజేరియన్ చేయాల్సిందిగా వారే అడుగుతున్నారంటున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు కూడా ఏదైనా జరిగితే విమర్శలు ఎదుర్కోనాల్సి వస్తుందనే ఉద్దేశంతో ఏ మాత్రం ఇబ్బంది అనిపించినా సిజేరియన్‌కు మొగ్గు చూపుతున్నారు. దీంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ భారీ సంఖ్యలో సిజేరియన్లు పెరుగుతున్నాయి.

ఇదీ లెక్క...

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో గడిచిన నాలుగేళ్లుగా పరిశీలిస్తే ప్రతి ముగ్గురు గర్భిణుల్లో ఒకరికి సిజేరియన్ చేస్తున్నారు. 2021-22 ఉమ్మడి విశాఖ జిల్లాలో 63,703 ప్రసవాలు జరగ్గా.. ఇందులో 18,216 సిజేరియన్ డెలివరీలే. ఇందులో ప్రభుత్వ ఆస్పత్రుల్లో 8,676, ప్రైవేటు ఆస్పత్రుల్లో 9,540 జరిగాయి. అలాగే 2022-23లో విభజిత విశాఖ జిల్లాలో 36,798 ప్రసవాలు జరగ్గా, ఇందులో సిజేరియన్లు 12,992. ప్రభుత్వ ఆస్పత్రుల్లో 7,358, ప్రైవేటు ఆస్పత్రుల్లో 5,634 సిజేరియన్లు చేశారు. 2023-24లో 37,511 ప్రసవాలు జరగ్గా... ఇందులో 15,077 సిజేరియన్లు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో 6,728, ప్రైవేటు ఆస్పత్రుల్లో 8,349 సిజేరియన్లు నిర్వహించారు.అదేవిధంగా 2024-25లో 30,832 ప్రసవాలు జరగ్గా.. వీటిలో 12,329 సిజేరియన్లు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో 6,253, ప్రైవేటు ఆస్పత్రుల్లో 6,076 జరిగాయి.

ప్రైవేటుకు సమానంగా 'కోతలు'

జిల్లాలో ప్రైవేటు ఆస్పత్రులతో సమానంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో కోతలు జరుగుతుండడం ఆందోళనను కలిగిస్తోంది. గడిచిన నాలుగేళ్లలో జిల్లాలో 1,68,844 ప్రసవాలు జరగ్గా... ఇందులో 58,614 సిజేరియన్లే ఉండడం గమనార్హం. వీటిలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో 29,015, ప్రైవేటు ఆస్పత్రుల్లో 29,599 జరిగాయి. అంటే.. ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో దాదాపు సమానంగానే జరిగాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సిజేరియన్ల సంఖ్య పెరుగుతుండడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. దీనిపై జిల్లా యంత్రాంగం ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొంటున్నారు. ఇక ప్రైవేటు ఆస్పత్రులకు సిజేరియన్ ప్రసవాలు కాసులు కురిపిస్తున్నాయి. సిజేరియన్‌కు ఆస్పత్రి స్థాయిని బట్టి కనీసం రూ.80 వేల నుంచి రెండు లక్షల రూపాయల వరకు వసూలు చేస్తున్నారు. ప్రసవం తరువాత తల్లి, బిడ్డ ఆరోగ్యాన్ని బట్టి ఈ మొత్తం మరింత పెరిగే అవకాశం కూడా ఉంది.


ఎన్నికైన సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

మేదరి సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

మహారాణిపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మేదరి సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక పూర్ణా మార్కెట్ వద్ద శ్రీక్రాంతి సమావేశ మందిరంలో ఆదివారం జరిగింది. అధ్యక్షుడిగా గ్రంధి రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా పోలేపల్లి నాగరాజు, కోశాధికారిగా తెల్లి వైకుంఠరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడుతూ తమకు వెదురు సమస్యను పరిష్కరించడంతో పాటు ప్రతి జిల్లాలోనూ కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కోరారు. కాగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రమాణ స్వీకారానికి వచ్చి నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

'నిరుద్యోగ భృతి అమలు చేయాలి'

అల్లిపురం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం తక్షణమే నిరుద్యోగ భృతి అమలు చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య జిల్లా కార్యదర్శి అచ్యుతరావు డిమాండ్ చేశారు. ఆదివారం అల్లిపురంలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన జిల్లా సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఇప్పటివరకు నిరుద్యోగ భృతికి సంబంధించి ఎటువంటి విధివిధానాలు ప్రకటించలేదని విమర్శించారు. నిరుద్యోగులకు ఎటువంటి ఆంక్షలు లేకుండా భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న ప్రభుత్వం ఈఏడాదిలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలన్నారు. ఈనెల 15 నుంచి జూలై 13 వరకు జిల్లాలోని నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులు తీసుకొని, జూలై 14న కలెక్టరుకు అందజేస్తామని తెలిపారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రాంబాబు, సందీప్, యు. నాగరాజు, ఎన్. మధు, రెడ్డి రవి, అశోక్, ఈశ్వర్ పాల్గొన్నారు.

కాళ్ల పారాణి ఆరకముందే..

... 5వ పేజీ తరువాయి

ల్యాబ్ టెక్నిషియన్లుగా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇద్దరూ ప్రేమించుకోవడంతో పాటు పెద్దలను ఒప్పించి పిఠాపురంలో గతనెల 9న వివాహం చేసుకున్నారు. అనంతరం బంధువులకు గాజువాక ప్రాంతంలో విందు కూడా ఇచ్చారు. ప్రస్తుతం దంపతులిద్దరూ గాజువాకలోనే నివాసం ఉంటున్నారు. శనివారం సాయి పుట్టినరోజు కావడంతో సెలవు లేని కారణంగా ల్యాబ్‌లోనే ఉండిపోయారు. ఆదివారం నగరంలోని ఆర్కే బీచ్‌కు వెళ్లేందుకు ములగాడ రోడ్డు మీదుగా ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. ఈ క్రమంలో మారుతి జంక్షన్ వద్ద ఓ ట్రాలర్ వెనుక నుంచి వీరి వాహనాన్ని బలంగా ఢీకొనడంతో వారిద్దరూ రోడ్డుపై తుళ్లిపడ్డారు. దీంతో సాయి అక్కడికక్కడే మృతి చెందగా, శాలిని కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది. ప్రమాదానికి కారణమైన ట్రాలర్ డ్రైవరును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు గాజువాక ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సాయి, శాలిని

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం : ఎమ్మెల్యే వంశీకృష్ణ

డాబాగార్డెన్స్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ప్రతిరోజూ యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంతో ఉండచ్చునని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం డాబాగార్డెన్స్ మెడిసీ ఆధ్వర్యంలో యోగాంధ్రలో భాగంగా ఆసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో అన్నింటి కంటే ముఖ్యమైనది ఆరోగ్యం అన్నారు. ఈనెల 21న నగరంలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో పాటు వివిధ రాష్ట్రాల నుంచి 50 మంది ప్రముఖులు హాజరుకానున్నట్టు చెప్పారు. మెడిసీ సీఎండీ డాక్టర్ శిరీషరాణి మాట్లాడుతూ వైద్యుల్లో యోగాపై అవగాహన కలిగించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, ప్రజలు, యోగ శిక్షకులు, గురువులు పాల్గొన్నారు.


యోగా సాధన చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

ఆటో డ్రైవర్లకు దుస్తులు పంపిణీ

సీతంపేట : రాజేంద్రనగర్‌లో ఉన్న జనసేన పార్టీ కార్యాలయంలో 14వ వార్డు ఆటో స్టాండ్ డ్రైవర్లకు దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఖాకీ చొక్కాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో జనసేన గెలుపునకు ఆటో డ్రైవర్లు సహాయ సహకారాలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, జన సైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

వైద్య విధానంలో మార్పులు రావాలి : సీపీ

విశాఖపట్నం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : వైద్య విధానంలో మార్పులు అవసరమని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. అలాగే ఎముకల వైద్యులు మినిస్కస్ (మోకాళ్లలోని కుషన్)ను కాపాడడంపై దృష్టిసారించాలని తెలిపారు. ఆర్థోస్కోపీ శస్త్ర చికిత్సల్లో వస్తున్న ఆధునిక వైద్య విధానాలపై సీతమ్మధారలోని కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నగరంలోని ఒక హోటల్‌లో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికాలో ఒక్కో వేలికి శస్త్ర చికిత్స చేసేందుకు స్పెషలైజేషన్ చేస్తున్నారన్నారు. మినిస్కస్‌కు ఆర్థోస్కోపీ చేయడం చాలా ఆనందంగా అనిపించిందని తెలిపారు. ప్రజల్లో వీటిపై అవగాహన కలిగించాలన్నారు. కిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ తమ ఆస్పత్రిలో ఇప్పటివరకు 200కుపైగా శస్త్ర చికిత్సలు నిర్వహించినట్టు వెల్లడించారు. కీహోల్ సర్జరీ స్పెషలిస్ట్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఉత్తరాంధ్రతోపాటు అనేక ప్రాంతాలకు చెందిన 150 మంది ఎముకల వైద్య నిపుణులు సదస్సుకు హాజరయ్యారన్నారు. అధునాతన పరికరాలతో ముగ్గురికి శస్త్ర చికిత్సలు నిర్వహించినట్టు తెలిపారు. చికిత్స అనంతరం పోస్ట్ ఆపరేటివ్ టీమ్ కూడా చాలా ముఖ్యమని, అటువంటి టీమ్ అత్యుత్తమైనది కిమ్స్‌లో ఉందన్నారు.ప్రస్తుతం 40 ఏళ్లలోపు వారిలో మోకాళ్ల అరుగుదల కనిపిస్తోందని, దీనికి జాయింట్ ప్రిజర్వింగ్ టెక్నిక్స్‌తో శస్త్ర చికిత్స నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజేష్‌కుమార్ రెడ్డి, డాక్టర్ సంతోష్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.


సదస్సుకు హాజరైన వైద్యులతో సీపీ శంఖబ్రత బాగ్చి

మృత్యు రహదారి!

... 5వ పేజీ తరువాయి

పరిశీలించి రహదారి పరిస్థితిని పరిశీలించినట్టు సమాచారం. పోర్టు రోడ్డులో నిత్యం ధూళి ఎగిసిపడుతుండడంతో అది రోడ్డుమీద పడి జిడ్డులా తయారవుతోంది. చిన్నపాటి చినుకులు పడినా ఆ జిడ్డు కారణంగా ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాల టైర్లు స్కిడ్ అవుతున్నాయి. వాహనం ఒక లైన్‌లో వెళుతుందని డ్రైవర్ భావించినా, వాహనం వెళుతున్నపుడు రోడ్డుపై గల జిడ్డు కారణంగా కాస్త అటూఇటూ ఊగుతూ వెళుతున్నట్టు పోలీసులు గుర్తించినట్టు తెలియవచ్చింది. పైగా పోర్టు నుంచి రాకపోకలు సాగించే భారీ వాహనాల డ్రైవర్లు నిర్లక్ష్యంగా వాహనాలను నడపడం వల్ల ద్విచక్ర వాహనదారులు ముందుకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారని, అలాగని భారీ వాహనం వెనుక వెళ్లలేక, ఓవర్‌టేక్ చేసేందుకు ప్రయత్నించి ప్రమాదాలకు గురవుతున్నట్టు కూడా ట్రాఫిక్ పోలీసులు అంచనాకు వచ్చినట్టు తెలియవచ్చింది. పోర్టు రోడ్డు విస్తరణ పనుల కారణంగా రోడ్డు పొడవునా మట్టి పేరుకుపోవడంతో వాహనాలు స్కిడ్ అయ్యేందుకు కారణంగా మారుతోందని ట్రాఫిక్ పోలీసులు అభిప్రాయపడుతున్నారు. ఇకపై పోర్టు రోడ్డును తరచూ శుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటే తప్ప ప్రమాదాలకు అడ్డుకట్ట పడే అవకాశం లేదని ఉన్నతాధికారులకు నివేదించాలని ట్రాఫిక్ విభాగంలోని అధికారులు నిర్ణయానికి వచ్చారు.

ఏసీఎఫ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

డాబాగార్డెన్స్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ఏసీఎఫ్ పార్టీ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడిగా నగరానికి చెందిన ఉరుకూటి శ్రీనివాసరావును నియమిస్తూ ఆ పార్టీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు దాసరి రాంబాబు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే తెలంగాణ అధ్యక్షుడిగా రామ్ సహాయం జయసింహారెడ్డిని నియమించారు.

నేడు అసోం చీఫ్ సెక్రటరీ రాక

మహారాణిపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : అసోం రాష్ట్ర చీఫ్ సెక్రటరీ డాక్టర్ కోట రవి సోమవారం నగరానికి రానున్నారు. ఉదయం ఆయన ఢిల్లీ నుంచి విశాఖ చేరుకుని ఇక్కడి ఐటీ సెజ్‌లో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ కార్యక్రమాలకు హాజరవుతారు.

నరకం చూపిస్తున్న రోడ్లు

... 5వ పేజీ తరువాయి

ఏడాదిపాటు కూడా సుందరంగా ఉండకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. కొత్తగా రోడ్డు వేసిన కొద్ది రోజులకే అదే రోడ్డుని మరొక పని కోసం జీవీఎంసీలోని తాగునీటి సరఫరా, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఎలక్ట్రికల్ విభాగాలతో పాటు భూగర్భ విద్యుత్ కేబుళ్లు వేయడానికి ఏపీఈపీడీసీఎల్, స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా నీటి సరఫరా పైపు లైన్ల ఏర్పాటు కోసం తవ్వేస్తుండడం నగరవాసులను ఆగ్రహానికి గురిచేస్తోంది. శివాజీ పార్కు రోడ్డును ఏడాది కిందట రూ.కోట్లు వెచ్చించి కొత్తగా వేయడంతో ఆ మార్గం అందంగా కనిపించేది. కానీ ఇటీవల ఈ రోడ్డును నీటి సరఫరా పైపు లైన్ల కోసం తవ్వేయడంతో రోడ్డంతా బురదమయంగా మారిపోయింది. వాహనచోదకులు సైతం ఇబ్బందులకు గురవ్వడం, ప్రమాదాల బారినపడడం జరుగుతోంది. అలాగే అక్కయ్యపాలెం మహరాణి పార్లర్ జంక్షన్ నుంచి 80 ఫీట్ రోడ్డు మొత్తం అమృత్ పథకం కింద నీటి సరఫరా పైపు లైన్ల ఏర్పాటు నిమిత్తం తవ్వేయడంతో ఆరు నెలల కిందట నిర్మించిన తారు రోడ్డు కాస్త మట్టిరోడ్డు మాదిరిగా కనిపిస్తోంది. సీతమ్మధార ప్రాంతంలో అన్ని రోడ్లను జీవీఎంసీ ఆరు నెలలు కిందట నిర్మిస్తే.. అమృత్ కోసం విచ్చలవిడిగా తవ్వేశారు. గురుద్వారా కూడలి నుంచి సత్యం జంక్షన్ వరకు జాతీయ రహదారి నిర్మాణం ఇటీవలే జరిగింది. కానీ విద్యుత్ కేబుళ్ల కోసం వెంటనే యంత్రాలతో రోడ్డును తవ్వేశారు. రోడ్లను తవ్విన తర్వాత మట్టితో కొంతవరకు కప్పి, తర్వాత గ్రావెల్ వేసి పైన కాంక్రీట్ వేసి పూడ్చాలి. దీని వల్ల భవిష్యత్తులో రోడ్డు కుంగకుండా ఉండడం తోపాటు వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఉంటుందనేది ఇంజనీర్ల అభిప్రాయం. కానీ ఏదైనా అవసరం కోసం రోడ్డు తవ్విన తరువాత ఆయా రహదారులను సక్రమంగా పూడ్చకుండా తవ్వి తీసిన మట్టితోనే పూడ్చేసి వదిలేస్తున్నారు. దీనివల్ల రోడ్లన్నీ గుంతలుగా మారడం, వర్షం పడితే రహదారి అంతా మట్టిమయంగా మారిపోతోంది.

శాఖల మధ్య సమన్వయం కుదిరేది ఎప్పుడు?

జీవీఎంసీ అధికారులు ఒక మార్గంలో కొత్తగా రోడ్డు వేయాలనుకుంటే ఆ విషయాన్ని ముందుగానే గ్రేటర్ ఇంజనీరింగ్‌లోని ఇతర విభాగాలతోపాటు ఏపీఈపీడీసీఎల్, మొబైల్ నెట్‌వర్క్ ప్రొవైడ్ చేసే సంస్థలకు సమాచారం ఇవ్వాలి. ఆయా శాఖలు, విభాగాల ఆధ్వర్యంలో ఆ మార్గంలో పైపు లైన్లు, కేబుళ్ల నిర్మాణాల కోసం రోడ్డును భవిష్యత్తులో తవ్వాల్సి ఉంటుందని భావిస్తే... ఆ విషయాన్ని జీవీఎంసీ పబ్లిక్ వర్క్స్ ఇంజనీరింగ్ విభాగం అధికారులకు తెలియజేయాలి. కొత్తగా రోడ్డు వేసే మార్గంలో ఆయా శాఖలు, విభాగాల అధికారులు తమ పని పూర్తి చేసిన తరువాత కొత్తగా బీటీ రోడ్డు నిర్మిస్తే ఆ రోడ్డు ఐదేళ్లు కాకుండా ఏడెనిమిదేళ్లపాటు గుంతలు లేకుండా పటిష్ఠంగా ఉంటుంది. దీనివల్ల ప్రజలకు సౌకర్యంగా ఉండడంతోపాటు ప్రజాధనం దుర్వినియోగం కాకుండా అడ్డుకట్ట వేసినట్టవుతుంది. నగరంలో రోడ్లను ఇష్టారాజ్యంగా తవ్వేడంపై వివాదం తలెత్తిన ప్రతీసారి అన్ని శాఖల అధికారులు సమావేశమై... ఇకపై రోడ్ల నిర్మాణం, తవ్వకంపై సమాచారం ఇచ్చిపుచ్చుకోవడం ద్వారా సమన్వయంతో ముందుకు వెళ్లాలని అధికారులు అభిప్రాయానికి వస్తున్నారు. కానీ ఏళ్లు గడిచినా ఆచరణలో మాత్రం అది అమలు కావడం లేదు. ఇకనైనా అధికారులు రోడ్ల నిర్మాణం, తవ్వకం విషయంలో సమన్వయంతో ముందుకు వెళ్లాలని ప్రజలు కోరుతున్నారు.



'పల్లా'కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

డంపింగ్ యార్డును తరలించాలని వినతి

పెదగంట్యాడ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 76వ వార్డు పరిధి రామచంద్రా నగర్‌ను ఆనుకుని ఉన్న డంపింగ్ యార్డును జనావాసాలకు దూరంగా తరలించాలని 76వ వార్డు జేఏసీ ఆదివారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రాన్ని అందజేసింది.

డంపింగ్‌యార్డును ఆనుకుని రామచంద్రానగర్,రిక్షాకాలనీ, డెయిరీ కాలనీ, బర్మా కాలనీ ఉన్నాయని, యార్డు నుంచి వచ్చే దుర్వాసన వల్ల పరిసర ప్రాంతాల ప్రజలు రోగాల బారినపడుతున్నారని టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు, జేఏసీ సభ్యులు ఎమ్మెల్యేకు వివరించారు. అందువల్ల డంపింగ్ యార్డును జనావాసాలకు దూరంగా తరలించాలని కోరారు. 76వ వార్డు జేఏసీ ప్రతినిధులు మంత్రి శంకర నారాయణ, ఆర్మీ గోవింద్, ఆర్.నారాయణ మూర్తి, రాంబాబు, అచ్చిలనాయుడు, రమేశ్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'పల్లా'కు పరామర్శ

పెదగంట్యాడ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును పెదగంట్యాడకు చెందిన టీడీపీ నాయకులు ఆదివారం పరామర్శించారు. శ్రీనివాసరావు తండ్రి పల్లా సింహాచలం ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, పలువురు టీడీపీ నాయకులు గాజువాకలోని దివంగత పల్లా సింహాచలం ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పల్లా శ్రీనివాసరావును పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు పులి వెంకటరమణారెడ్డి, డి.సోమునాయుడు, ఎన్.అప్పలరెడ్డి, ఎం.అప్పారావు, పి.సోమునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **డ్రాగన్ 3డి** : జగదాంబ
- **బల్లెరినా** : రమాదేవి
- **గేంబ్లర్స్** : శారద
- **థగ్ లైఫ్** : మెలోడి, సంగం, కామేశ్వరి, శ్రీరామా, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం) అరుణ (పెదగంట్యాడ)
- **భైరవం**: శ్రీకన్య, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక)
- **సింగిల్** : గోకుల్, మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 24, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 18, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 34, బీరకాయలు 32, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 36, క్యాబేజీ 18, క్యారెట్ 40 దొండకాయలు 20, బంగాళదుంపలు 19, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 54, అల్లం (పాతది)52, బరబాటి 30, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 70, బద్దచిక్కుడు 50, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి)90, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 80, కీరదోస 30, క్యాప్సికమ్ 68, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 36, చిలగడదుంపలు 30, కంద 56, దేముడు చిక్కుడు 56, కూర పెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 34, గోరుచిక్కుడు 38, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4, చుక్క కూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, క్రరపెండలం 18, మామిడిఅల్లం 56, బొప్పాయి 30, బూడిద గుమ్మడికాయ 20, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	83
లైవ్ ధర	103
విత్ స్కిన్	176
స్కిన్‌లెస్	186

చురుగ్గా మినీ పార్కుల నిర్మాణ పనులు

» పార్కుల అభివృద్ధిపై దృష్టిసారించిన ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు



నిర్మాణంలో ఉన్న పార్కు

గాజువాక, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వీఎంఆర్డీఏ మినీ పార్కుల నిర్మాణ పనులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. మినీ పార్కుల నిర్మాణ పనులను ఏడేళ్ల క్రితం ప్రారంభమవ్వగా, కేవలం ప్రహరీలను మాత్రమే నిర్మించి వదిలేశారు. వంటిల్లు జంక్షన్ నుంచి నడుపూరు పంపు హౌస్ వరకు వుడా కాలనీ పక్క నుంచి గల స్థలంలో స్థలంలో మినీ పార్కుల నిర్మాణం వల్ల ఈ రోడ్డు సుందరమయంగా ఉండడమే కాకుండా ప్రజలు సేదతీరేందుకు ఎంతో అనువుగా ఉంటుందని అప్పట్లో అధికారులు భావించి 2019లో ప్రతిపాదనలను రూపొందించారు. సుమారు రెండు కిలోమీటర్ల పొడవైన రోడ్డులో తొమ్మిది పార్కులను నిర్మించేందుకు ప్రణాళికాధికారులు నిర్ణయించి, అదే ఏడాదిలో నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. తొలి విడతగా పార్కులకు సంబంధించి ప్రహరీలను నిర్మించారు. తరువాత పార్కుల లోపల సుందరీకరణ పనులు చేపట్టకుండా విడిచిపెట్టారు. సుమారు ఏడేళ్ల పాటు పార్కుల అభివృద్ధి పట్ల దృష్టిసారించలేదు. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గాజువాక ఎమ్మెల్యేగా ఎన్నికైన పల్లా శ్రీనివాసరావు ఈ మినీ పార్కుల అభివృద్ధిపై దృష్టి సారించారు. దీంతో వీఎంఆర్డీఏ నిధులతో పార్కుల అభివృది పనులను యుద్ధప్రాతిపదికన జరిగేలా అధికారులు చర్యలు చేపట్టారు. దీంతో నెల రోజులుగా పనులు చురుగ్గా సాగుతున్నాయి. పార్కు లోపల సందర్శకులు కూర్చునేందుకు వీలుగా బెంచీలు, ఆకర్షణీయమైన పూలమొక్కల ఏర్పాటుతోపాటు ఇతర అభివృద్ధి పనులను చేపట్టనున్నట్టు అధికారులు తెలిపారు. మినీ పార్కులు మొత్తం అభివృద్ధి చెందితే ఈ రోడ్డు శోభాయమయంగా మారుతుందని చెప్పవచ్చు. ప్రజలకు కూడా ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

ఆటో బోల్తా పడి యువకుడి మృతి

గాజువాక, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఆటో నడపడంతో వాహనం బోల్తా పడి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన గాజువాక పంతులు గారి మేడ జంక్షన్ వద్ద ఆదివారం చోటుచేసుకుంది. గాజువాక ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలిలాఉన్నాయి. చినగంట్యాడ ప్రాంతానికి చెందిన బలగం సురేశ్ (22),ఆయన స్నేహితులు దుర్గాప్రసాద్, లోకేశ్, మరో ఇద్దరు చినగంట్యాడలో ఆదివారం మధ్యాహ్నం మద్యం సేవించారు. ఆ తరువాత ఎస్‌ఏడీ ప్రాంతంలో ఓ స్నేహితుడు పార్టీ ఇస్తానని పిలవడంతో ఈ ఐదుగురూ ఆటోలో బయలుదేరారు. ఆటోను లోకేశ్ నడుపుతుండగా పంతులుగారి మేడ జంక్షన్ వద్దకు వచ్చేసరికి ఒక్కసారిగా బోల్తా పడింది. ఆటో సురేశ్‌పై పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. గాజువాక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు..



సంతోశ్ (ఫైల్)

ఆటోనగర్: తుంగ్లాం రైల్వే గేటుకు సమీపంలో ఉన్న వై-జంక్షన్ వద్ద ఈ నెల 12వ తేదీ ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన యువకుడు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు.

88వ వార్డు పరిధి యాదవ జగ్గరాజుపేటలో గొంప శ్రీను భార్య సూర్యమణి, కుమారుడు వరప్రసాద్ (సంతోశ్-25), కుమార్తెతో కలిసి ఉంటున్నారు. ఈ నలుగురూ వివిధ ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. ఈ నెల 12న సంతోశ్ తన సోదరి అయిన గీతను స్కూటీపై ఎక్కించుకుని యాదవజగ్గరాజుపేట నుంచి ఆటోనగర్ వైపు వెళ్తుండగా వై-జంక్షన్ వద్ద కంటైనర్ లారీ వెనక నుంచి వీరి వాహనాన్ని ఢీకొనడంతో గీత అక్కడికక్కడే మృతి చెందిన సంగతి తెలిసిందే. తీవ్రంగా గాయపడిన సంతోశ్ చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేర్పగా, ఆదివారం మృతి చెందాడు. రోడ్డు ప్రమాదంలో ఇద్దరు పిల్లలు మృతి చెందడంతో శ్రీను, సూర్యమణి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

నేత్ర వైద్య శిబిరానికి మంచి స్పందన

అగనంపూడి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి ఫార్మాసిటీ పునరావాస కాలనీలో గల స్థానిక హైస్కూల్ ప్రాంగణంలో అమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో 135 మందికి నేత్ర పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ శిబిరాన్ని కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మీ ప్రసాద్, టీడీపీ వార్డు అధ్యక్షుడు కర్రి దశేంద్రతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫార్మాసిటీ కాలనీలో వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ గొంప వెంకటరావు, అర్జున్, స్థానిక నాయకులు డొక్కా రమేశ్, అర్జునరావు, తలుపుల నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు

యోగాంధ్రను విజయవంతం చేద్దాం

డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు

గాజువాక, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న నగరంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని చేపట్టనున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు అన్నారు. ఇక్కడి టీడీపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హాజరు కానున్నందున విజయవంతం చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కేంద్రం సహకారంతో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు.

టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ఈ నెల 22న మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం సంస్మరణ సభ జగ్గరాజుపేట వద్ద జరగనున్నదని, ఈ కార్యక్రమానికి ప్రతి కార్యకర్తతో పాటు ప్రజలు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, కార్పొరేటర్లు గంధం శ్రీనివాస్, పల్లా శ్రీనివాసరావు, కాకి గోవిందరెడ్డి, లేళ్ల కోటేశ్వరరావు, రౌతు శ్రీనివాసరావు, మొల్లి ముత్యాలనాయుడు, బొడ్డు నరసింహపాత్రుడు, నాయకులు పుచ్చా విజయ్‌కుమార్, ఎండీ రఫీ, విల్లా రామ్మోహన్‌కుమార్, నాగేశ్వరరావు, గోమాడ వాసు, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు నిర్వాసితులకు శాశ్వత పరిష్కారం చూపాలి

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఉక్కు నిర్వాసిత నిరుద్యోగులకు శాశ్వత పరిష్కారం చూపాలని ఉక్కు నిర్వాసితసంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఉక్కు నిర్వాసిత నిరుద్యోగులు ఆదివారం స్టీల్ ప్లాంట్ నెహ్రూ పార్కులో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఉక్కు కర్మాగారం కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితుల్లో చాలామందికి ఉపాధి కల్పించకపోవడం దారుణమన్నారు. ఇటీవల కాలంలో నిర్వాసిత కాంట్రాక్టు కార్మికులను కూడా యాజమాన్యం తొలగించిందని ఆరోపించారు. నిర్వాసితుల సమస్యలపై ప్రజాప్రతినిధులు కల్పించుకుని న్యాయం చేయాలని, నిర్వాసితులకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు పి.భాస్కరరావు, ఉమ్మడి అప్పారావు, సోంబాబు, అప్పలరెడ్డి, వెంకటేశ్, చిన్న, సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.



పార్కును శుభ్రం చేస్తున్న తిరుమలనగర్ వాసులు

తిరుమలనగర్ పార్కుల్లో స్వచ్ఛ భారత్

కూర్మన్నపాలెం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రజలు సేద తీరేందుకు వీలుగా పార్కులు పరిశుభ్రంగా ఉండాలన్న లక్ష్యంతో 87వ వార్డు పరిధి తిరుమల నగర్‌లో కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని ఈ సందర్భంగా కాలనీ అసోసియేషన్ ప్రతినిధి నాగభూషణం మాట్లాడుతూ ఎన్టీఆర్ నగర్, సత్యానగర్, తిరుమల నగర్ పార్కుల్లో, ఓపెన్ జిమ్, తదితర ప్రాంతాల్లో చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను తొలగించామన్నారు. రహదారులను చీపుర్లతో శుభ్రపరిచామని పేర్కొన్నారు. కాలుష్య నివారణకు అందరూ తమ ఇళ్ల వద్ద మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు విశ్వేశ్వరరావు, పరమానందం, పరమేశ్వరరావు, సన్యాసిరావు,రమణ, సూర్యప్రకాశ్, పలువురు చిన్నారులు పాల్గొన్నారు.

అదేవిధంగా ఆర్ఆర్ వాకర్స్ ప్రతినిధులు బొండా ఎల్లాజీ, శ్రీదేవిల ఆధ్వర్యంలో రావుల చెరువు వాకింగ్ ట్రాక్, పార్కుల్లో శ్రమదానం చేశారు. పార్కుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాలను ఏరివేసి పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. పలువురు విద్యార్థులు, యువత, వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

పీఎం మోదీ ఆశయ సాధనకు కృషి చేయాలి

బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు



సమావేశంలో మాట్లాడుతున్న కరణంరెడ్డి నరసింగరావు

గాజువాక, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సంకల్పించిన వికసిత భారత్ లక్ష్యంగా కేంద్రం ముందుకు సాగుతుందని భారతీయ జనతా పార్టీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. 72వ వార్డులో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోదీ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. మోదీ పాలనను ప్రపంచ దేశాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలందరూ కృషి చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నాయకులు సిరసపల్లి నూకరాజు, పి.శ్రీనివాస్, దీనంకొండ కృష్ణంరాజు, బొండా యల్లాజీరావు, జి.భువనేశ్వరి, తులసీదాస్, రోహిణి, తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి ఉక్కు జగన్నాథుని రథోత్సవాలు

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఉక్కు నగరంలోని జగన్నాథస్వామి ఆలయంలో ఈ నెల 27వ తేదీ నుంచి రథోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆ రోజు ప్రత్యేక పూజాది కార్యక్రమాలతో ఉత్సవాలను ప్రారంభిస్తామన్నారు. జగన్నాథ, బలభద్ర, సుభద్రలను శోభాయమానంగా అలంకరించి పూజలు జరుపుతామని పేర్కొన్నారు.

ఆల్ ఉయ్ కెన్ సంస్థ సేవలు ప్రశంసనీయం

» పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు



అథ్లెట్ నందినికి చెక్ అందజేస్తున్న విప్ గణబాబు

ఎమ్మెల్యే గణబాబు ముఖ్య అతిథిగా హాజరై

వేపగుంట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులంతా ఆల్ ఉయ్ కెన్ సంస్థగా ఏర్పడి నిస్వార్థంగా వివిధ ఆశ్రమాలు, నిరుపేదలకు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు పేర్కొన్నారు. నాయుడుతోట లక్ష్మీ కల్యాణ మండపంలో ఆదివారం సాయంత్రం ఆల్ వుయ్ కెన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పలు అనాథ పిల్లలకు, ఆశ్రమాలకు అవసరమైన సరకులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ప్రసంగించారు. అథ్లెటిక్స్‌లో విశేష ప్రతిభ కనబరిచిన కొరుబోలు నందినికి సభ్యులంతా రూ.60 వేలు అందించి ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. అలాగే మనసు అనాథ పిల్లల ఆశ్రమానికి పది బీరువాలు, వివిధ ఆశ్రమాలకు నిత్యావసర సరకులను దాతల సహకారంతో సేకరించి అందించడం గొప్ప విషయ మన్నారు. ఈ కార్యక్రమంలో నేవల్ కమాండర్ లీలా కృష్ణ, సంస్థ ఫౌండర్ కొట్టు సురేంద్రకుమార్, అధ్యక్షుడు తిప్పల కృష్ణ, ఎల్లపు వెంకటేశ్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కశింకోట టీడీపీ సంస్థాగత ఎన్నికల పరిశీలకుడిగా 'కరక'



కరక దేవుడు

పెందుర్తి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి శాసనసభ నియోజకవర్గ పరిధిలోని కశిం కోట మండల టీడీపీ సంస్థాగత ఎన్నికల పరిశీలకుడిగా పెందుర్తి మండల టీడీపీ అధ్యక్షుడు కరక దేవుడు నియమితులయ్యారు. ఈ మేరకు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం నుంచి కరక ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. గొరపల్లి పంచాయతీ పరిధిలోని కరకవానిపాలేనికి చెందిన దేవుడు గతంలో సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుడిగా, టీడీపీ నియోజకవర్గ సమన్వయ కర్తగా, మండల అధ్యక్షుడిగా పనిచేశారు. టీడీపీని పటిష్ఠం చేయడానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన చెప్పారు.

సీఎం పర్యటనకు ట్రయల్ రన్



ట్రయల్ రన్ నిర్వహిస్తున్న దృశ్యం

విశాఖపట్నం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సీఎం నారా చంద్రబాబునాయుడు సోమవారం నగర పర్యటనకు రానున్న నేపథ్యంలో ముందస్తు భద్రతా వాహన శ్రేణి ట్రయల్ రన్‌ను ఆదివారం నిర్వహించారు. విశాఖ విమానాశ్రయం నుంచి ముఖ్యమంత్రి పర్యటించే నోవాటెల్, ఆర్కే బీచ్, ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్స్, పీఎం పాలెం మీదుగా ఈ ట్రయల్ రన్ నిర్వహించారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీసీపీలు అజిత, మేరీ ప్రశాంతి, ఆర్డీవో శ్రీలేఖ విమానశ్రయంలో వివిధ శాఖల అధికారులతో భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి: సీఐ

పెందుర్తి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రౌడీ షీటర్లు మంచి ప్రవర్తనతో మెలగాలని సీఐ సతీశ్‌కుమార్ సూచించారు. పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. పంచాయితీలు నిర్వహించడం, రౌడీ కార్యకలాపాలకు దిగడం చేస్తే జైలుకు పంపుతామని హెచ్చరించారు. కుటుంబంతో ఆనందంగా జీవించాలని, లేదంటే జైలులో మగ్గాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

డిఫెన్స్ మద్యం బాటిళ్లు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో ఎక్సైజ్ అధికారులు

విశాఖపట్నం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నగరంలో అనధికారికంగా డిఫెన్స్ మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ అధికారులు అరెస్టు చేశారు. నిందితుని వద్ద నుంచి 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. మహారాణిపేట ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ సీఐ రవికిరణ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చావులమదుం వద్ద ఓ వ్యక్తి మద్యం విక్రయిస్తున్నట్టు ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్.ప్రసాద్‌కు సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ అధికారులు నిఘా పెట్టారు. ఈ క్రమంలో డిఫెన్స్ మద్యం బాటిళ్లను విక్రయించేందుకు యత్నిస్తున్న కాపు మురళీమోహన్ (38)ను అదుపులోకి తీసుకున్నారు. మురళీమోహన్ నేవల్ డాక్‌యార్డ్‌లో 15 ఏళ్లుగా కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్నాడన్నారు. తనకున్న పరిచయాలతో ఈ మద్యం బాటిళ్లను సేకరించి అధిక ధరలకు విక్రయిస్తున్నాడు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ ఆదివారం తెలిపారు.

ఘనంగా మోదకొండమ్మ పుట్ట బంగారం తీత



కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

గోపాలపట్నం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఇందిరానగర్‌లో మోదకొండమ్మ పుట్ట బంగారం తీత కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు మేళ తాళాలతో అమ్మవారి పుట్ట బంగారం తీయడానికి తరలివెళ్లారు. అనంతరం అమ్మవారి ఘటాలను పురవీధుల్లో ఊరేగించారు. సోమవారం అమ్మవారి తొలేళ్ల ఉత్సవం, మంగళవారం ప్రధాన పండుగ నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

మల్కాపురం. జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రకాశనగర్ శివరామకృష్ణ ఆలయ ప్రాంగణంలో అలివేలు మంగ, పద్మావతి, వేంకటేశ్వరస్వామి సమేత ఆలయ పదో వార్షికోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఈసందర్భంగా భక్తులు 108 కలశాలతో ఉత్సవమూర్తులను పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం స్వామి మూల విరాట్‌కు పాలాభిషేకం చేశారు. సాయంత్రం కోలాటం, భక్తి గీతాల కార్యక్రమాలు జరిగాయి. సోమ, మంగళవారాలు స్వామివారికి ప్రత్యేక పూజలు జరుగుతాయి.

97వ వార్డులో రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు

పెందుర్తి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలోని 97వ వార్డులో రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని కార్పొరేటర్ సేనాపతి వసంత చెప్పారు. చినముషిడివాడ నేతాజీ పార్క్‌లో రూ.40 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను ఆదివారం పరిశీలించారు. పనులు నాణ్యతతో చేపట్టాలని సూచించారు. ఆహ్లాదం, ఆరోగ్యం కోసం పార్కులు అవసరమన్నారు. ఈ కార్య క్రమంలో టీడీపీ సీనియర్ నేత సేనాపతి శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రవణా నక్షత్రం పూజలు

వేపగుంట జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నాయడుతోట రవినగర్ శేషాద్రి కొండపైన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శ్రవణా నక్షత్రం పూజలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో తెల్లవారుజామున 4.30 గంటలకు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. మధ్యాహ్నం అన్న సంతర్పణలో దాదాపు 500 మంది భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదం స్వీకరించారు. అన్నదాన కార్యక్రమానికి ఆర్థిక సహాయం అందించిన వారికి ఆలయ అర్చకులు కల్యాణ వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఆదినారాయణ, కృష్ణమూర్తి, సన్యాసిరావు, రాజేంద్ర, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.